• సహస్ర దీపాలంకరణ సేవకు ట్రయల్‌రన్



దీపాలు వెలిగించి ఊయలకు తిరుచ్చి వాహనం వేలాడదీసిన దృశ్యం..

తిరుమల- తిరుపతి తరహాలో చినవెంకన్న వైభవాన్ని చాటేలా ఏర్పాటు చేసిన సహస్ర దీపాలంకరణ సేవకు శనివారం రాత్రి అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. దాత కట్టించిన సహస్రదీపాలంకరణ మండపం లో దీపాలను వెలిగించి అక్కడ ఏర్పాటు చేసిన స్టేజీపై ఊయలకు స్వామివారి తిరుచ్చి వాహనాన్ని ఉంచి కాసేపు ఊపారు. ఈనెల 9 నుంచి పూర్తిస్థాయిలో ఈ సేవను శ్రీవారికి ప్రవేశపెడతామని ఆలయ అధికారులు చెప్పారు.



కార్తీక మాసం తొలిరోజు శనివారం ప్రత్యేక పూజలందుకున్న పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి



పంచారామ క్షేత్రాలైన భీమవరం సోమేశ్వరస్వామి, పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరస్వామికి అభిషేకాలు



కార్తీక పూజలకు వేళాయే.. 6

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ఏలూరు

జిల్లా వార్తలు

5

ఆదివారం 3 నవంబరు 2024



అప్పులు.. తిప్పలు

ప్రతి ఇంటా పెరుగుతున్న అవసరాలు.. ఆర్భాటాలు

- తప్పనిసరి రుణాలు, చేబదుళ్లు
- సకాలంలో తీర్చలేక అవస్థలు
- జిల్లాలో రెచ్చిపోతున్న కాల్‌నాగ్‌లు..
- బలవుతున్న సామాన్యులు

ఆంధ్రజ్యోతి సండే స్పెషల్

అప్పు చేసి పప్పుకూడు.. ఇదొకప్పటి మాట. ఇప్పుడు ఆ అప్పే చేయనివారు నూటికో కూటికో ఒకరు. అంతలా అప్పుతో అన్ని కుటుంబాలు ముడిపడి ఉన్నాయి. ఏటా చేసిన అప్పు తీర్చలేక నిండు ప్రాణాలు తీసుకునేవారు కొందరైతే.. ఉన్న ఈ ఊరును, సొంత ఇంటిని వదులుకుని పరార్ అయ్యేవారు ఇంకొందరు. ధనిక, పేద తారతమ్యం లేకుండా అప్పు ఇప్పుడు నిత్యకృత్యమైంది. ఇదెలా పుడుతుందో, ఎక్కడెక్కడ పుడుతుందో అన్వేషించే వారి సంఖ్య కోకొల్లలు. సర్కారే నేరుగా అప్పు తీసుకోండి.. హాయిగా బతకండంటూ ఏడాదికి కోట్ల రూపాయలు చేతుల్లో పెడుతున్న సంఘాలు ఉన్నాయి. ప్రభుత్వ ఆధీనంలో ఉండే బ్యాంకుల్లోను ఏటా ఇచ్చే అప్పులన్నీ కోట్లలోనే. ఆఖరుకి సర్కారే అప్పుల్లో కూరుకుపోయిన రోజులివి. ఇది ఎంత వరకు వెళుతుందో ఆదివారం ప్రత్యేక కథనంలో తెలుసుకుందాం. 6లో..

గుంతలు..గుడ్‌బై!

ఐదేళ్ల పాటు జిల్లాలో ఏ మూలకెళ్ళినా గుంతలో పడాల్సిందే. కొందరేమో తీవ్ర ప్రమాదాలకు గురై మరణం అంచు వరకు వెళ్లొచ్చినవారే. దాదాపు డజన్ల సంఖ్యలో క్షతగాత్రులు. గుంత పూడ్చండి సామీ అంటే అప్పటి పాలకులంతా అదేదో నేరమ న్నట్టుగా ఎగాదిగా చూసేవారు. ఇప్పుడు ఆ దిశ నుంచి ప్రజ అంతా రోడ్ల మీద హాయిగా వెళ్లేలా కూటమి ప్రభుత్వం సంక్రాంతి లోపే గుంతల రహిత రహదారులు ఉండేలా కార్యాచరణకు దిగింది. రాబోయే తొమ్మిది నెలల వ్యవధిలోనే శాశ్వత ప్రాతిపదికన రోడ్ల మరమ్మతుకు మరోప్లాను సమాంతరంగా అమలు చేస్తోంది.

ఇక గుంతల రహిత రహదారులే లక్ష్యం

- జిల్లాలోని రోడ్లపై గుంతలు పూడ్చేందుకు రూ.76 కోట్లు
- శాశ్వత మరమ్మతులకు మరో రూ.46 కోట్లు
- అనువైన రోడ్ల కోసం అంతా కలిపి రూ.122 కోట్లు మంజూరు
- రంగంలోకి అధికారులు, ప్రజాప్రతినిధులు
- సంక్రాంతికి ముందే పూర్తయ్యేలా కార్యాచరణ
- రాబోయే తొమ్మిది నెలల్లోనే శాశ్వత ప్రాతిపదికన పనులు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

గడిచిన ఐదేళ్లగా పల్లె, పట్నం తేడా లేకండా రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. రాష్ట్రీయ రహదారుల్లో అనేకచోట్ల స్విమ్మింగ్ పూల్‌ను తలపించేలా భారీ గుంతలు. ఏలూరు నుంచి జంగారెడ్డిగూడెం వెళ్లాలన్నా, కొయ్యలగూడెం నుంచి తాడేపల్లి గూడెం వెళ్లాలన్నా, కైకలూరు నుంచి ఏలూరు రావాలన్నా అడుగడుగునా అవాంతరాలే. ఈ రోడ్లలో వాహనాలన్నీ పడీలేస్తూ ముందుకు సాగేవి. గంటల తరబడి ప్రయాణంలో జాప్యం. వర్షాకాలంలో జరిగిన ప్రమాదాల సంఖ్య ఇంతకుముందెన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో నమోదు. ప్రభుత్వా సుపత్రులకు వచ్చే రోడ్డు ప్రమాద క్షతగాత్రుల సంఖ్య మూడింతలు పెరిగిందంటే అప్పటి పరిస్థితి ఇట్టే అర్థమవుతుంది. కనీసం ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ పరిధిలో ఉన్న మార్గాలన్నింటిలో మరమ్మతులు చేస్తామంటూ పైకి గొప్పలు చెప్పడం, ఆచరణలో ఆ ప్రయత్నం చేయకపోవడం విచిత్రం. జగన్ పాలనలో ఎక్కడా గుంత పూడ్చేందుకు తట్టెడు మట్టి పోయలేదు. బడ్జెట్‌లో రహదారుల మరమ్మతులకు ఇంత మొత్తం కేటాయించామని ప్రకటించారే తప్ప నయాపైసా ఎక్కడా మరమ్మతులకు విదల చేయలేదు. ప్రధాన మార్గాలన్నింటిలోనూ ప్రయాణించే ఆర్టీసీ బస్సుల్లో అత్యధికం దెబ్బతిన్నాయి. గుంతలు పడిన రోడ్లలో ప్రయాణించలేక ప్రజలు పడిన పాట్లు అన్నీఇన్నీ కావు. తాము అధికారంలోకి వస్తే రోడ్ల మరమ్మతులు చేపడతామని ఎన్నికల తరుణంలో కూటమి పక్ష నేతలందరూ ప్రకటించారు.

గుంతల రహిత రహదారులు

గడిచిన ఐదేళ్లల్లో జనం పడిన పాట్లను దృష్టిలో పెట్టుకుని గుంతలు పడిన మార్గాలన్నింటిలోనూ మరమ్మతులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. శనివారం నుంచే ఈ ప్రక్రియ రాష్ట్ర వ్యాప్తంగా అమలవుతోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమాల్లో భారీ సంఖ్యలోనే పాల్గొన్నారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 1,836 కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రహదారులు ఉండగా వీటిలో 932 కిలోమీటర్లు మేర మార్గమంతా గుంతలమయమైంది. తిరగడానికి అవకాశమే లేకుండా పోయింది. ఆ పరిస్థితుల్లో కేవలం గుంతలు పూడ్చేందుకే ప్రభుత్వం రూ.76 కోట్లు కేటాయించింది. ముందస్తుగా గుర్తించిన గుంతలను పూడ్చి ఆమార్గంలోని ఆటంకాలను కొంతలో కొంత అధిగమించేలా చేయడం ప్రభుత్వం ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది. తొలుత ఈ గుంతలు పూడ్చే కార్యక్రమం సంక్రాంతిలోపే పూర్తి కావాలని నిబంధన విధించింది. పనులు వేగవంతంగా ముందుకు సాగేలా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు దగ్గరుండి పర్యవేక్షించాలని ప్రభుత్వం సూచించింది. ఇంకోవైపు శాశ్వత ప్రాతిపదికన మార్గాలన్నింటికీ పనులు నిర్వహించేందుకు మరో రూ.46 కోట్లు కేటా యించారు. ఈ పనులన్నింటినీ కాంట్రాక్టర్లకు అప్పగించి రాబోయే తొమ్మిది నెలల కాలంలోనే పూర్తి చేసేందుకు వీలుగా నిధులు, కార్యాచరణ రూపొందించారు. జంగారెడ్డిగూడెం-ఏలూరు ప్రధాన మార్గంలో ఇప్పుడున్న అస్తవ్యస్త పరిస్థితులను తొలగించేందుకు వీలుగా తాత్కాలిక మరమ్మ తులకు దాదాపు రూ.కోటి 13 లక్షలు కేటాయించింది. తాజాగా గోపన్నపాలెం వద్ద మంత్రి కొలుసు పార్థసారథి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఉమ్మడిగా రోడ్లకు గుంతలు పూడ్చే కార్యక్రమానికి శనివారం శ్రీకారం చుట్టారు.



గోపన్నపాలెంలో రోడ్డుపై గుంతలను పూడుస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

ప్రజలు అభివృద్ధికే ఓటు వేశారు

బటన్‌లు నొక్కే జగన్‌కు ఓటు వేయలేదు : మంత్రి పార్థసారథి 7



సోమవరప్పాడులో సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

కలెక్టర్ వెట్రిసెల్వి

దెందులూరు/పెదవేగి నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సచివాలయ ఉద్యోగులతో పాటు అన్ని శాఖల అధికారులు ప్రజలంద రికీ సమయానికి అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించి మంచిపేరు తెచ్చుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి సూచించారు. సోమవరప్పాడు గ్రామ సచివాలయాన్ని శనివారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ ఆవరణలో భూ రీసర్వే గ్రామ సభ జరుగుతుండడంతో సచివాలయ ఉద్యోగులతో కలెక్టర్ మాట్లాడారు. ఆమె వెంట తహసీల్దార్ సుమతి, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

వ్యాయామ కళాశాల పరిశీలన

గోపన్నపాలెంలోని ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలను కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే చింతమనేని పరిశీలించారు. కళాశాలలో 110 మంది విద్యార్థులకు కేవలం ఇద్దరు మాత్రమే అధ్యాపకులు ఉన్నారని, పలు సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను చింతమనేని కోరారు. అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఉచిత భోజనం సౌకర్యం కల్పించాలని విద్యార్థులు కోరగా కళాశాల యాజమాన్యం ద్వారా ప్రతిపాదనలు పంపిస్తే ప్రయత్నాలు చేస్తామన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లుబాబు) ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నతానియాల్ వారి వెంట ఉన్నారు. అనంతరం లక్ష్మీపురంలోని దెందులూరు వ్యవసాయ మార్కెట్ యార్డును పరిశీలించారు.

భూ మాయ!

నూజివీడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) :

అటవీ విస్తీర్ణం అధికంగా ఉన్న ప్రాంతాల్లో నూజివీడు నియోజకవర్గం ఒకటి. ఈ ప్రాంతం లోనే నూజివీడు మండలంలోని సుంకొల్లు బీట్‌తో పాటు ముసునూరు మండలం కాట్రేనిపాడు, రమణక్కపేట, చాట్రాయి మండలంలోని పలు ప్రాంతాల్లో అటవీప్రాంతం అత్యధికంగా ఉండగా, నూజివీడు మండలంలోని సుంకొల్లు బీట్‌లో సిద్ధార్థనగర్, బత్తులవారిగూడెం తదితర ప్రాంతాల్లో అటవీ భూములు ఉన్నాయి. 2003 నుంచి సంబంధిత భూములను నిరుపేదలు సాగులోకి తీసుకురాగా కొండగట్లు మినహా, మిగిలిన భూములు సాగుభూములుగా మారాయి. అయితే నూజివీడు ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని సుంకొల్లు బీట్‌లో భూములు వ్యవహారం ఆదినుంచి వివాదాస్పదంగానే ఉంది. అందుకు కారణం నాటి జమీందారులు భూములను ప్రభుత్వానికి అప్పగించే సందర్భంలో సమష్టి వ్యవసాయ క్షేత్రాల పేరిట రికార్డులు పుట్టుకు రావడం, ఆ రికార్డుల ఆధారంగా భూ క్రయ, విక్రయాలు వాస్తవ భూమి కన్నా అత్యధికంగా చోటు చేసుకున్నాయి. అయితే సుంకొల్లు బీట్‌లోని సిద్ధార్థనగర్‌లో సమష్టి వ్యవసాయ క్షేత్రం పేరిట జమీందారుల దగ్గర నుంచి రాయించుకున్న భూములు ఒకచోట ఉంటే ప్రస్తుతం క్రయ,విక్రయాలు జరుగుతున్న భూములు మరోచోట ఉండటం ఈ వివాదాలను మరింత పెంచేందుకు కారణమవుతున్నాయి. మరోవైపు సంబంధిత భూములు జమీందారీ కాలంకు ముందు నుంచి కనీసం సాగులోకి రాకుండానే సమష్టి వ్యవసాయ క్షేత్రాల పేరిట డాక్యుమెంట్లు ఎలా పుట్టుకు వచ్చా యనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. సిద్ధార్థనగర్ ఆర్.ఎస్.నెంబర్ -1లో


- సమష్టి వ్యవసాయ క్షేత్రం పేరిట రికార్డులు.. ఆది నుంచి వివాదాస్పదమే
- పలుమార్లు రీసర్వే చేసినా రికార్డుల్లోనే అక్రమార్కులు
- సుంకొల్లు, కనిమెర్ల ఫారెస్ట్ బీట్‌ల సరిహద్దు విభజన చేయాలి

రికార్డుల్లో పేర్లు ఉన్నా అధికారుల సంతకాలు లేవు..

సిద్ధార్థనగర్ భూవ్యవహారంలో పలువురు వద్ద ఉన్న రికార్డులకు సంబంధించి సీపీఐ నాయకులు సమాచార హక్కు చట్టం కింద వివరణ కోరగా, సంబంధిత భూముల్లో పలువురు పేర్లు రికార్డులో ఉన్నా అధికారుల సంతకాలు లేకపోవడంతో ఆయా రికార్డులు వాస్తవం అవునా? లేక? మధ్యలో ట్యాంపరింగ్ జరిగిందా? అనేది నిర్ధారించలేమని, గతంలో రెవెన్యూ అధికారులు సమాధానం చెప్పడం విశేషం. ఏదిఏమైనా నూజివీడు పరిధిలోని అటవీ భూములు, రెవెన్యూ పోరంబోకు భూములను పరిరక్షించాలంటే సమగ్ర సర్వే నిర్వహించి, రికార్డులను నవీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఫారెస్ట్ బీట్ సరిహద్దు విభజన జరగాలి

సిద్ధార్థనగర్‌లో స్వాతంత్ర్యం అనంతరం జమీందారులు భూ అప్పగింత సమయంలో దాదాపు 400 ఎకరాలను రికార్డుల్లో చూపకుండా తమవద్దే ఉంచుకున్నారు. దీంతో అది ఏ గ్రామానికి చెందకుండా సర్‌ప్లస్ భూమిగా మిగిలిపోయింది. సిద్ధార్థనగర్ గ్రామ సరిహద్దుల్లో సుంకొల్లు, కనిమెర్ల ఫారెస్ట్ బీట్‌లు ఉండగా, సంబంధిత ఫారెస్ట్‌బీట్ సరిహద్దులు నిర్ణయం కాలేదు. దీంతో ఆర్.ఎస్.నెంబర్ -1ని చూపుతూ ఈ సర్‌ప్లస్ భూమిపై భూ బకాసురులు నీడ పడింది. మరోవైపు నిరుపేదల సాగులో ఉన్న భూములకు డబ్బు ఆశచూపి గతంలో అక్రమంగా రికార్డులు సృష్టించు కున్న పలువురు స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేయడంతో ఈ భూవ్యవహారం రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులకు తలనొప్పిగా మారింది. ఏలూరు జిల్లా పరిధిలోని సుంకొల్లు ఫారెస్ట్‌బీట్, ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని కనిమెర్ల ఫారెస్ట్ బీట్ సరిహద్దులను నిర్ణయిస్తే కొంతవరకు భూవివాదాలు తగ్గే అవకాశం ఉంటుంది.



సమాచార హక్కు చట్టంలో రికార్డుల్లో అధికారుల సంతకాలు లేవంటూ గతంలో రెవెన్యూ అధికారులు ఇచ్చిన వివరణ

గన్నవరం మండలం చిక్కవరానికి చెందిన సుబ్బయ్య, సూర్యప్రభాష్ సమష్టి వ్యవసాయ క్షేత్రం పేరిట 1958లో అప్పటి జమీందార్ నరసింహా అప్పారావు వద్ద నుంచి కొనుగోలు చేశారు. సుబ్బయ్య, ఇతరుల నుంచి అనేకమంది ఈ భూములను కొనుగోలు చేయగా, సిద్ధార్థనగర్‌లో 1800 ఎకరాలకు పైబడి భూమి ఉండగా, రెవెన్యూ రికార్డుల ప్రకారం ఉండాల్సిన భూమికన్నా 2,800 ఎకరాలకు రెవెన్యూ ఖాతాలు ఉండడం విశేషం.

రీసర్వేలు చేసినా..

సిద్ధార్థనగర్‌లో (రెవెన్యూపరంగా నర్సుపేట)లో రెవెన్యూ రికార్డులలో అవకతవకలపై పలుమార్లు మండల, జిల్లా ఉన్నతాధికారులు రీసర్వే నిర్వహించారు. అయినా రికార్డుల్లో తమ పేరు ఉంది కాని, తమ భూమి ఎక్కడ ఉందో? తెలియడం లేదని, 2018 నుంచి నేటివరకు అనేకమంది రెవెన్యూ అధికారులకు అర్జీలు సమర్పించడం చూస్తే రీసర్వే ఎంత పారదర్శకంగా జరిగిందో అర్థమవుతోంది.

మాజీ ఎమ్మెల్యే దూలం బలవంతంగా..

అగ్రిమెంట్లు రాయించుకున్నారు..

- అసోసియేషన్ సమావేశంలో 83 మంది చేపల రైతుల ఆవేదన

కైకలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : 'గత ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు మమ్మల్ని బెదిరించి ఇతర లీజుదారులు ఎవ్వరిని రానివ్వకుండా బలవంతంగా ఎకరం రూ.63,500కు లీజు అగ్రిమెంట్లు రాయించుకున్నారు. మాకు నకలు కాపీ ఇవ్వకుండా వేధిస్తున్నారు. ఎన్ని ఏళ్లకు లీజుకు రాయించుకున్నది తెలియకుండా చేశార'ంటూ చేపల రైతుల అసోసియేషన్ సమావేశంలో పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కైకలూరు సీతారామ ఫంక్షన్ హాలులో శనివారం రాష్ట్ర చేపల రైతుల సంఘం అధ్యక్షుడు తాడినాడ బాబు అధ్యక్షతన అసోసియేషన్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో కైకలూరులోని 114 ఎకరాల చేపల చెరువు వివాదాన్ని 83 మంది రైతులు అసోసియేషన్ దృష్టికి తీసుకొచ్చారు. ఆ భూముల్లో కైకలూరు శ్యామలాంబ అమ్మవారు, రామలింగేశ్వర స్వామి దేవస్థానాలకు చెందిన సుమారు 10 ఎకరాల భూమి ఉందని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర చేపల రైతుల అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ స్పందిస్తూ చేపల చెరువుల్లో సన్న,చిన్నకారు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. 'గత ప్రభుత్వ హయాంలో దూలం నాగేశ్వరరావు, అతని కుమారులు కైకలూరు,మండవల్లి మండలంలోని పుట్లచెరువు, ముదినేపల్లి మండలం లోని కోడూరు గ్రామాల్లో వందలాది ఎకరాల చెరువులను బలవంతంగా రైతుల నుంచి తక్కువ లీజుకే అగ్రిమెంట్లు రాయించుకున్న విషయం ఎన్నికల ముందే రైతులు మా దృష్టికి తీసుకొచ్చారు. అసోసియేషన్‌కు చెందిన ఐదుగురు సభ్యులు కమిటీగా ఏర్పడి సమస్యను పరిష్కరించి రైతులకు న్యాయం చేయాల'ంటూ సూచించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, కన్వీనర్ నరసింహారావు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



చేపల రైతుల అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కొల్లగొట్టిన కొండపై..

నిగ్గు తేల్చండి..!

- పవన్ ఆదేశాలతో కదిలిన అధికార యంత్రాంగం
- సుందరగిరి ప్రాంతాన్ని నిశితంగా పరిశీలన
- అక్రమ తవ్వకాల్లో కొందరు వైసీపీ నేతల హస్తం?



రికార్డుల ప్రకారం సుందరగిరిపై అక్రమ తవ్వకాలను తనిఖీ చేస్తున్న రెవెన్యూ, మైనింగ్, అటవీ అధికారులు

ద్వారకాతిరుమల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్వయంభూ లక్ష్మీనారసింహుని ఆలయ భూములపై నిగ్గు తేల్చాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఇచ్చిన ఆదేశాలతో అధికార యంత్రాంగం ఒక్కసారిగా కదిలింది. మండలంలోని ఐఎస్ జగన్నాథపురంలో అక్రమంగా జరిగిన కొండ తవ్వకాలపై అధికారులు శనివారం ప్రత్యేక దృష్టి సారించారు. సుందరగిరిపై కొలువుతీరిన లక్ష్మీనారసింహునికి 50 ఎకరాల వరకు భూములున్నాయి. ఈ క్రమంలో దీపం-2 పథక ప్రారంభానికి శుక్రవారం గ్రామానికి వచ్చిన పవన్‌కల్యాణ్ ముందుగా ఆలయాన్ని దర్శించుకుని ఆలయ భూముల రక్షణపై ఆరా తీశారు.

వైసీపీ నేతల హస్తం?

ఈ సుందరగిరిని గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతలు కొందరు పూర్తిగా కొల్లకొట్టారని స్థానికులు కొందరు పవన్‌కు ఫిర్యాదు చేశారు. అక్కడి భూములను అక్రమంగా తవ్వేశారని, ఇందులో ఎన్నో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన పవన్ విచారణ జరిపి వారం లోగా నివేదిక ఇవ్వాలని కలెక్టర్ వెట్రిసెల్విని ఆదేశించారు. ఈనేపథ్యంలోనే శనివారం రెవెన్యూ, అటవీ, మైనింగ్ అధికార యంత్రాంగం క్షేత్రస్థాయికి వెళ్లి అక్కడి తవ్వకాలను పరిశీలించారు. దేవాలయానికి ఆనుకుని ఉన్న కొండ ప్రాంతాన్ని కొలతలు వేశారు. ఈ తవ్వకాలు అక్రమమా..? సక్రమమా..? వీటికి లైసెన్స్ ఉందా..? ఉంటే ఎంత వరకు తవ్వారు.. పరిధికి మించి తవ్వకాలు జరిగాయా.. అలా జరిగితే ఆ గ్రావెల్‌ను ఎవరు.. ఎక్కడకు పంపారు.. ఆ గ్రావెల్ వల్ల వచ్చిన సొమ్ము ఎంత మేరకు ప్రభుత్వానికి చెల్లించారు.. అవినీతికి ఎవరైనా పాల్పడ్డారా.. ఎవరి పాత్ర ఇందులో ప్రముఖంగా ఉంది.. అన్న దానిపై అధికార యంత్రాంగం ఆరా తీస్తోంది.



బర్రింకలపాడు వద్ద మిర్చితోటలో నిలిచిన వర్షం నీరు

వర్షంతో పంటలకు దెబ్బ

జీలుగుమిల్లి/చింతలపూడి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జీలుగుమిల్లి, తాటియాకుల గూడెం, రామన్నపాలెం, కామయ్యపాలెం, చింతలపూడి, రాఘవాపురం పరిసరాల్లో శనివారం వేకువజాము నుంచి కుండపోతగా వర్షం కురిసింది. కోతలకు వచ్చిన వరి చేలల్లో వర్షం నీరు చిలిచింది. జీలుగుమిల్లి సమీపంలోని అశ్వారావుపేట వాగు కొద్దిసేపు రోడ్డు పైనుంచి పొంగి ప్రవహించింది. ఇటీవల వేసిన మిర్చి, పొగాకు తోటల్లో వర్షం నీరు నిలవడంతో తేమ ఎక్కువై నాటిన మొక్కలు చనిపోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వాతావరణ పరిస్థితుల వల్ల ఈ ఏడాది మిర్చి, పొగాకు నాట్లు ఆలస్యంగా మొదల య్యాయి. మల్లాయిగూడెం, పోతునూరు తదితర గ్రామాల్లో వరి పంటను కోసి కల్లాలపైన, రోడ్ల పైన ఆరబోయగా వర్షంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



ధైర్యం కోల్పోతే అన్నీ కోల్పోయినట్లే : గరికపాటి

భీమవరం టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎవరైనా సరే ధైర్యం కోల్పోతే అన్నీ కోల్పోయినట్లే అని పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావు అన్నారు. ఆనంద ఫంక్షన్ హాలులో ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ ఛైర్మన్ యూకే విశ్వనాథరాజు ఆధ్వర్యంలో కీర్తిశేషులు చేకూరి వేంకట సూర్య నారాయణరాజు, విశ్రాంతి న్యాయమూర్తి (దేవుడు రాజు) 98వ జయంతి ఉత్సవాలు సందర్భంగా శనివారం రాత్రి ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక సదస్సులో ఆయన ప్రవచించారు. సుగ్రీవుని దగ్గర వాలికి దీటుగా వున్న ఆంజనేయుడు, జాంబవంతుడు వంటి బలవంతులు వున్న సైన్యం ఉన్నా కేవలం ధైర్యం కోల్పోవడం వల్ల అన్నీ కోల్పోయి, అన్నీ వదులుకొని కిష్కింధ పర్వతం మీద వుండే పరిస్థితి దాపురించిందన్నారు. రాముడు పలికిన ధైర్య వచనాల వల్ల సుగ్రీవుడు ధైర్యం తెచ్చుకుని శ్రీ రాముడు సహాయంతో రాజ్యాన్ని, తన భార్యని సాధించుకోగలిగాడన్నారు. అనంతరం గరికపాటిని సత్కరించారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు నాగేంద్ర సాయి



భీమవరం ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గత నెల 26, 27, 28 తేదీల్లో తెనాలిలో జరిగిన 68వ స్కూల్ గేమ్స్ ఏపీ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ అండర్ - 14 హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టులో భాష్యం ఉన్నత పాఠశాల, భీమవరం-1 విద్యార్థి కూండ్రపు నాగేంద్రసాయి పాల్గొని జాతీయా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల జేఈవో శ్రీమన్నారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ కె హనుమంతరావు తెలిపారు. శనివారం నాడు ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో ఈనెల 26వ తేదీ నుంచి 30 వరకు జరగనున్న 68వ ఎస్‌జీఎఫ్ ఇంటర్ స్టేట్ అండర్ - 14 హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు.

అప్పులు.. తిప్పలు!

- ప్రతి ఇంటా అప్పుల కుప్పలే
- పెరుగుతున్న అవసరాలు.. ఆర్భాటాలు..
- ఇంటిలో ఇల్లాలి నుంచి పిల్లల వరకు అప్పులే
- రెచ్చిపోతున్న కాల్‌నాగ్‌లు..
- ఏటా వందల మంది ఉసురు

ఆంధ్రజ్యోతి సండే స్పెషల్



(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఒకానొకప్పుడు ఉమ్మడి కుటుంబాలు వర్ధిల్లిన నాడు అప్పంటేనే ఆ కుటుంబాలన్నీ వణికిపోయేవి. ఆ పరిస్థితి రాకూడదని దేవుళ్ళకు మొక్కేవారు. ఉన్నదానిలోనే సరిపెట్టుకోవడమే తప్ప అప్పు జోలికి వెళ్ళేందుకే జంకు. అంతకంటే మించి అప్పు తీసుకుంటే ఆ కుటుంబానికి అప్రదిష్టే. సమాజంలో పెద్దింటిగా మెలిగినవారికి ఈ పరిస్థితి నామోషీగా ఉండేది. తమ హీన స్థితికి ఇదొక నిదర్శనంగా భావించేవారు. కష్టించి పనిచేయడమే ధ్యేయంగా మెలిగిన రోజుల్లో అత్యవసరాల్లో తప్ప చేబదులుకు కూడా చేయిచాచని కుటుంబాలు లెక్కకు మిక్కిలి. అప్పట్లో ఇంటి పెద్దే అన్ని పద్దులు సరిచూసుకునేవారు. ఎవరికెంత కావాలో.. ఏడాదికి ఎంత ఖర్చో అంచనాకు వచ్చేవారు.

పెళ్ళైనా.. పేరంటమైనా సోకులకు పోయేవారు కాదు. ఆర్థికంగా కొంత స్థిమితపడి క్రమశిక్షణగా మెలిగే కుటుంబాలను అప్పటికీ, ఇప్పటికీ కూడా పిసినారి బోర్డు తగిలిస్తారు. అదే స్తోమతకు మించి అప్పులు చేసి సోకులకు పోయేవారిని చూసి మురిసిపోతారు. రానురాను ఇంటి ఖర్చులు పెరుగుతూ పోతున్నాయి. రానురాను ఇవి కాస్తా పెరిగి ఉమ్మడి కుటుంబాలు రకరకాల కారణాలతో విచ్ఛిన్నమయ్యాయి. ఆ స్థానంలో ఒంటరి కుటుంబాలు వచ్చాయి. సరిగ్గా ఇక్కడే సొంత ఆర్థిక వ్యవస్థ తిరగబడింది. ఆస్తులు, అంతస్తులన్నీ ఎవరంతట వారుగా పంచుకుని వేరుపడ్డారు. మనసులు విరిగి.. బంధాలు కరిగి.. ఒకప్పటి ఆనందాన్ని అంతం చేసుకుని.. పొరుగింటి వారే తమకు ఆదర్శంగా మలుచుకుని చేతినిండా ఖర్చులు.. ఆపై అప్పులు. ఇంకేముంది అప్పు తీరే మార్గంలేక చితికిపోయిన సంసారాలెన్నో ఉన్నాయి.

ఇంటింటా అప్పులు

అప్పు చేయకపోవడం ఒకప్పటి ధర్మం. ఇప్పుడు అప్పే చేసి ఇంటిని సాకడం మరో ధర్మం. ఏకంగా ఇంట్లో మహిళా మణులే నిరంతర ఆదా చేసేవారుగా ఇంతకుముందు ఓ గుర్తింపు. అందుకనే ఇంట్లో ఆడవారు క్రమశిక్షణగా ఉంటే ఆ ఇంటికి తిరుగుండదని తెగ గొప్పలు చెప్పేవారు. కాని ఇప్పుడు ప్రతి కుటుంబానికి ఓ అప్పు ప్రభుత్వమే సమకూరుస్తుంది. త్వరగా కడితే ఇంకో అప్పు. ఇచ్చే అంతటికి తక్కువ వడ్డీ అంటూ ఏటా ఓ ఆఫర్. జిల్లా వ్యాప్తంగా ఉన్న 43 వేల పొదుపు సంఘాలు ఉండగా వీటిలో 4 లక్షల 30 వేల మందికిపైగా మహిళలే సభ్యులు. వీరంతా కలిసి ఏడాదికి బ్యాంకుల నుంచి సుమారు రూ.1100 కోట్ల నుంచి 1200 కోట్లు అప్పుగా తీసుకుంటారు. ఉమ్మడిగా ప్రతి నెలా వాయిదా పద్ధతిన బ్యాంకుల్లో చెల్లిస్తూనే వస్తారు. ఈ సొమ్ములతోనే జీవనోపాధికి అవకాశం అంటూ సర్కార్ యోచిస్తుంటే వీరిలో కొందరు తాము తీసుకున్న తక్కువ వడ్డీ సొమ్మును తిరిగి ఎక్కువ వడ్డీకి తిప్పుతుంటారు. బయట వడ్డీ రూపాయిన్నర నుంచి మూడు రూపాయల పైమాటే. అవసరాన్ని బట్టి కొందరు ఈ అప్పుల వైపు చేయి చాపుతారు. ఒకప్పుడు ఈ పొదుపు సంఘాలన్నింటికి ఏడాదికి ఐదొందలు నుంచి ఆరొందలు కోట్లు వరకు ఉండే రుణం కాస్తా ఇప్పుడు రెట్టింపు కావడం ఒక విచిత్రమైతే తాము తీసుకున్న అప్పును ఇంకొకరికి అప్పుగా ఇచ్చి రుణ గ్రహీతల సంఖ్యను వీరంతా రెట్టింపు చేస్తున్నారు. అంటే సరాసరిన ప్రతీ ఇంట్లోను ఓ అప్పు ఉన్నట్టే. దీనికితోడు సొంతిల్లు ఉంటే అదే పదివేలు. ఇంకేముంది బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. రుణం పొందితే చాలు కల్లో.. గెంజోతాగి సొంతింట్లోనే బతకొచ్చనే కల నిజమయ్యేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులతోపాటు మిగతా అన్ని తరగతులది ఇదే తాపత్రయం. దీంతో ఈ జిల్లాలోనే ఏడాది పొడవునా గృహ అవసరాల కోసం ఇచ్చే రుణాల సంఖ్య రూ.1300 కోట్లు దాటింది. ఇదొకనాడు ఒక వంతుగానే ఉండేది. ఇప్పుడు నెల వచ్చిపడితే చాలు.. అమ్మో ఇఎంఐ(ప్రతినెలా చెల్లింపు) పేరిట గగ్గోలు పెట్టాల్సిందే. ఇది ఒక ఏడాది కాదు.. 13 నుంచి 15 ఏళ్ళ సుదీర్ఘ అప్పు పోరాటం చేయాల్సిందే. సాధారణంగా అద్దె ఇళ్ళల్లో ఉంటే నెలకు సరాసరిన 7 నుంచి 11 వేలలోపు అద్దె చెల్లిస్తే సరిపోతుంది. కాని ఈఎంఐ వైపు తొంగి చూసినవారంతా 25 నుంచి 34 వేల రూపాయల వరకు సరాసరిన నెలవారీ కిస్తులు బ్యాంకులకు చెల్లించాల్సిందే. ఇదికాకుండా అనేక కుటుంబాలు తమ స్తోమతకు మించి మరీ అప్పులు చేస్తున్నాయి. ఉదహరణకు ఇంట్లో టివి, రిఫ్రిజిరేటర్ ఉంటే చాలనుకునేవారు. ఇప్పుడా ట్రెండ్ కాస్తా మారీ ఇంకోవైపు ఒంగి చూస్తుంది. ఇల్లు అంటూ ఉంటే చాలు ఏకంగా ఏసీ, వాషింగ్ మిషన్, హీటర్‌తోపాటు మరిన్ని గృహోపక రణాలు కూడా అత్యవసరమే. ఇక చేసేదేముంది. ముందస్తుగా పెట్టుబ డి పెట్టే ప్రైవేటు కంపెనీలు ఎలాగూ ఉన్నాయి. వీటికి తల తాకట్టు పెట్టైనా నెలవారీ చెల్లింపు చేయాల్సిందే. ఇంకోవైపు కార్లు, బైక్‌లకు కోట్లాది రూపాయలు అప్పులు చేసే కుటుంబాలు వేలల్లోనే కనిపిస్తున్నాయి. ఒక్క ఏలూరు జిల్లాలోనే ప్రతి ఏటా మూడు వేల కోట్లు వీటి కోసమే ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీల్లో ఉన్న వారైనా లేకుంటే మధ్య తరగతి అయినా అప్పు చేయాల్సిందేనని అంతలా అప్పుకు అలవాటు పడిపోయారు.

• అప్పులు లేకుండా బతకలేం

బి. రమాదేవి, ఏలూరు



అప్పులు చేయకుండా బతకడం కష్టమే అంటారు చాలా మంది. ఎప్పుడైనా డబ్బు అవసరం కావొచ్చు. ఇలాంటి సమయంలో ఖచ్చితంగా అప్పులు చేయాల్సి వస్తుంది కదా. నేను, నా భర్త కష్టపడినా వచ్చే సొమ్ము సరిపోదు. అప్పులు చేయడం, తీర్చడం షరా మామూలు అయిపోయింది.

• అప్పులు చేయడం మామూలే

ఎం.రాజు, ఏలూరు



అప్పులు చేయడం, తీర్చడం మామూలే. వ్యాపార రీత్యా అవసరం అలా చేయిస్తుంది. కొన్ని సమయాల్లో అప్పులు తప్పక చేయాల్సి వస్తుంది. ప్రస్తుత పరిస్థితుల్లో సామాన్య, మధ్యతరగతి ప్రజలు జీవించడం కష్టంగా మారింది. ప్రతి వస్తువు ధర పెరిగింది. నిత్యావసరాలతో పాటు సామాన్య మానవుడు జీవన స్థితిగతులు మాత్రం మారడంలేదు. ఆదాయం పెరగడంలేదు.

కాలనాగులెన్నో..

రోజులు మారాయి.. అవసరాలు పెరిగాయి. అత్యవసరాలు రెండింతలయ్యాయి. క్షణాల్లో సొమ్ము చేతికందాలి. దానికి ఎంత వడ్డీ అయినా పర్వాలేదు. అలాంటి ట్రెండ్ ఇప్పుడు కొందరి పాలిట శాపం అవుతుంది. ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలన్నీ విలనిజం పాటిస్తున్నాయి. ముందుగా అప్పు తీసుకునే వారందరికీ మీ ఆధార్ కార్డు ఒక్కటిస్తే చాలని బిస్కెట్ విసిరి ఆ తరువాత రకరకాలుగా షరతులతో సంతకాలు చేయించుకుంటారు. ఇంకేముంది ఒక్క నెలలోనే కడితే తక్కువ వడ్డీ అని చెప్పి రానురాను ఇచ్చిన సొమ్ము అంతా వడ్డీకే సరిపోయింది అసలు ఎక్కడెంటూ నిత్యం వేధింపులు. గూండాలు, రౌడీలతో బెదిరింపులు. అంతకంటే మించి రెచ్చిపోయిన ఇంకొందరు మహిళలపై లైంగిక వేధింపులకు తోడు అవమానాలు. చీటికి మాటికి ఇంటి వద్ద వాలిపోవడం, ఇరుగుపొరుగువారితో చర్చించడం, ఇంటి పరువుని బజారుకెక్కించడంలో వీరు దిట్ట. తమకు ఇవ్వాల్సిన అప్పు వసూలు కోసం ఎంతకైనా బరితెగిస్తారు. కాల్‌మనీ వ్యాపారం మధ్య తరగతి కుటుంబాలను చిన్నాభిన్నం చేసింది. ఈ ఒక్క ఏడాదిలోనే ఈ తరహా కేసులు పదుల సంఖ్యలో పోలీసుల దృష్టికి వెళ్ళగా మిగతా కేసులన్నీ ఎక్కడికక్కడే మిగిలిపోయాయి. ఆఖరికి ప్రైవేటు ఫైనాన్సర్లు బరితెగించి భౌతికదాడులకు తెగబడిన సంఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అనేక మంది ఉసురు తీసుకుంటున్నారు.

బక్కచిక్కిన బ్యాంకు కెనాల్



సిద్ధాంతం ప్రధాన బ్యాంక్ కెనాల్ బక్కచిక్కింది. గుర్రపుడెక్క, పచ్చగడ్డి, పిచ్చిమొక్కలు, వ్యర్థాలతో నిండిపోయింది. బ్యాంక్ కెనాల్ చూసే వారికి పిల్ల కాలువలా కనపడుతున్నది. ఈ కెనాల్‌పై ఆధారపడి సుమారు 30 వేలకు పైగానే ఎకరాలకు సంబంధించి సాగునీరు సరఫరా అవుతుంది. ఈ కాల్వ పట్ల నిర్లక్ష్యం చేయడం ద్వారానే ప్రస్తుతం ఈ దుస్థితి నెలకొంది. కెనాల్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు. - పెనుగొండ

చెస్ క్రీడాకారులకు అభినందన



ఎమ్మెల్యే రఘురామను కలిసిన చెస్ క్రీడాకారులు

భీమవరం అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో భీమవరం అనసూయ చెస్ అకాడమీ విద్యార్థులు అండర్-14 బాలికలు, అండర్-17 బాలుర విభాగల్లో తృతీయ స్థానం సాధించిన భవిష్య దాట్ల, ఆముదాల పల్లి కార్తీక్, జుత్తిగ వరుణ్‌తేజ్, నాలం వరుణ్‌తేజ్‌ను ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు శనివారం అభినందించారు. అలాగే ఇంటర్నేషనల్ రేటింగ్ సాధించిన జాపీత్ వర్మను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ కోచ్ మాదాసు కిషోర్, సంఘసేవకులు అల్లు శ్రీనివాస్, జిల్లా చదరంగ అసోసియేషన్ సభ్యులు తోట హరిబాబు, మైలాపురి మురళి, తోట ఫణి పాల్గొన్నారు.



విద్యుత్ వెలుగుల్లో ఆచంటేశ్వర స్వామి ఆలయం..





నరసాపురం గోదావరిలో పుణ్య స్నానాలు చేసి దీపాలు వెలిగిస్తున్న భక్తులు.. పాలకొల్లు క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో లోకాయుక్త జడ్జి రజనీ దంపతులకు స్వామివారి చిత్రపటం ఇస్తున్న దృశ్యం



పాలకొల్లులో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

మొదలైన కార్తీకం

• ఆలయాలకు భక్తుల తాకిడి • ప్రత్యేక పూజలు, అభిషేకాలు

పాలకొల్లు అర్బన్/భీమవరం టౌన్/ ఆచంట/ పోలవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం తొలి రోజు శనివారం వేకువ జామున గోమాతచే క్షీరా రామలింగేశ్వర స్వామి తొలి దర్శనం గావించి, తర్వాత భక్తులను స్వామి దర్శనానికి అనుమతించారు. పెద్దసంఖ్యలో వేకువ జాము నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ సమీపంలోని రేపాకవారి సత్రంలో సేవా సంస్థ ఆధ్వర్యంలో తొలి రోజు శ్రీకన్య కేశవరాజు దంపతుల ఆర్థిక సహాయంతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

- గునుపూడిలోని సోమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూకట్టారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనతరం భక్తులకు దర్శనం కల్పించారు. సాయత్రం స్వామి వారికి విశేష అలంకారం చేశారు. మొదటి రోజు స్వామివారికి రూ.22,700 ఆదాయంగా వచ్చింది.
- కార్తీక మాసం తొలి రోజు ప్రశిద్ధి చెందిన ఆచంటేశ్వరుని అనేక మంది భక్తులు దర్శించుకుని అభిషేకాలు నిర్వహించుకున్నారు. ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఈవో ఆదిమూలం వెంకట సత్యనారాయణ తెలిపారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.
- పోలవరం మండలంలో పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో మొదటి రోజు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. గోదావరిలో కార్తీకదీపాలు వదిలారు. పట్టిసీమ ఫెర్రీ రేవులో స్నానాల రేవుల వద్ద భద్రతా ఏర్పాట్లు పోలీసులు పర్యవేక్షించారు. ఆలయ సిబ్బంది ఇసుకతిన్నెల్లో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు భక్తులకు ఎంతగానో ఉపకరించాయి. భక్తులకు తీర్థప్రసాదాలు, అల్పాహారం, బోజన సదుపాయాలు కల్పించారు. అమరావతి హైకోర్టు ఆఫీసర్ కటకం వీరరాఘవులు భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి క్షేత్రపాలకులు భావన్నాయణ స్వామికి ఆలయ ఆవరణలో ఉన్న ఇతర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్షీరా రామలింగేశ్వర స్వామికి జడ్జి దంపతుల పూజలు

పాలకొల్లు అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంచారామ క్షేత్రమైన శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామిని శనివారం లోకాయుక్త జడ్జి పి.రజనీ (నెల్లూరు) దంపతులు దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ మర్యాదలతో జడ్జి దంపతులకు స్వాగతం పలికారు. స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం కళ్యాణ మండపంలో జడ్జి రజనీ దంపతులకు వేదాశీర్వాదం ఇచ్చి, స్వామివారి శేష వస్త్రాన్ని, చిత్రపటాన్ని ఆలయ ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు అందించారు.

శ్రీ వారికి భక్తుల తాకిడి



క్యూకాంప్లెక్స్‌లో వేచి ఉన్న భక్తులు

ద్వారకాతిరుమల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గోవిందనామస్మరణతో చినవెంకన్న క్షేత్రం మారుమోగింది. కార్తీకమాసం ప్రారంభం కావడంతో పాటు స్వామివారికి ప్రీతికరమైన రోజు అవడం వల్ల ఆలయానికి శ్రీవారి దర్శనార్థం విశేషసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో నిండి పోయాయి. అన్నివిభాగాలు కిటకిటలాడాయి. దాదాపు 20వేల మంది పైబడి భక్తులు స్వామివారిని దర్శించినట్టు ఆలయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. స్వామివారి ఉచిత దర్శనానికి దాదాపు రెండు గంటల పైబడి సమయం పట్టింది. దర్శనానంతరం భక్తులు అన్నప్రసాద భవనానికి వెళ్లి శ్రీవారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



గాంధీ భగవాన్‌రాజుతో కార్యవర్గ సభ్యులు

11 నుంచి జాతీయ స్థాయి సీనియర్ సిటిజన్ టెన్నిస్

45, 55, 65, 70, 75 ఏజ్ గ్రూపులుగా విభజన

పాలకొల్లు అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాస్మో కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల11వ తేదీ నుంచి 17 వరకు క్లబ్ ఫౌండర్, టెన్నీస్ ప్లేయర్ సీహెచ్ బుద్ధావతారం రాజు మెమోరియల్ పేరుతో జాతీయ స్థాయిలో టెన్నిస్ పోటీలు నిర్వహిస్తున్నట్టు కాస్మో కల్చరల్ క్లబ్ ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు తెలిపారు. శనివారం క్లబ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో భగవాన్‌రాజు మాట్లాడారు. పోటీలు 45, 55, 65, 70, 75 వయస్సుల వారీగా సింగిల్, డబుల్స్ పోటీలు నిర్వహిస్తున్నామని, ఈపోటీలు పట్టణంలోని తమ క్లబ్ ఆవరణలోని కోర్టులోనూ, టౌన్‌హాల్‌కోర్టులోనూ, నరసాపురంలోని ఆఫీసర్స్ క్లబ్ కోర్టులోనూ నిర్వహిస్తామన్నారు. పోటీల్లో పాల్గొన దలచిన వారు ఈనెల 5వ తేదీ లోపుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, విరమించుకునే వారు 6వ తేదీ లోపుగా విత్‌డ్రాచేసుకోవాలని భగవాన్‌రాజు సూచించారు. 11, 12 తేదీల్లో క్వాలిఫై మ్యాచ్‌లు, 13 నుంచి పోటీలు జరుగుతాయని, 17న ఫైనల్ మ్యాచ్ జరుగుతుందని తెలిపారు. 45, 70, 75 గ్రూపులకు సంబంధించి జీఎస్‌వీ ఆర్ఎన్ రాజు ఫోన్‌నెంబరు 98857 50999, 55, 65 గ్రూపులకు సంబంధించి శ్రీనివాస రాజు (నరసాపురం) 94916 66789 ఫోన్లలో సంప్రదించవచ్చునని తెలిపారు.

సంతోష్ ట్రోఫీకి సూర్యతేజ ఎంపిక



ఏలూరు రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభమయ్యే సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ పోటీలకు ఏలూరుజిల్లా అల్లూరి సీతారామరాజు స్టేడియం నుంచి యాగాటి సూర్యతేజ ఎంపిక అయ్యాడు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి జి.ఎస్.ఎస్ పవన్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల సీనియర్ అంతర్‌జిల్లా ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయని, నైపుణ్యం గల 45మంది క్రీడాకారులను ఎంపిక చేసి అనంతపూర్‌లోని ఆర్.బి.టి సెంటర్లో శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఈ పోటీల్లో ఏలూరు క్రీడాకారుడు సూర్యతేజ ఎంపిక కావడం పట్ల హర్షం ప్రకటించారు. ఫుట్‌బాల్ కోచ్ సిరాదుద్దీన్, డీఎస్‌డీవో శ్రీనివాసరావు, సంతోష్, శ్రావణ్, శేష, బాలు తదితర ఫుట్‌బాల్ క్రీడాకారులు అభినందించారు.

డబ్బులు చెల్లించకపోతే క్రిమినల్ కేసులు

ఆర్‌డీ నాగనర్సింహారావు

తాడేపల్లిగూడెం అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటికి సంబంధించిన ఆశీలు పాడుకుని డబ్బులు చెల్లించని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రీజనల్ డైరెక్టర్ నాగనర్సింహారావు హెచ్చరించారు. శనివారం తాడేపల్లిగూడెం మునిసిపాలిటీలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌డీ మాట్లాడుతూ రాజమండ్రి డివిజన్ పరిధిలో ఉన్న అన్ని రహదారులు వచ్చే జనవరి నాటికి మరమ్మతులు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. కుక్కలు ఎక్కువైపోయిన నేపథ్యంలో కుక్కల సంతతిని తగ్గించేందుకు తాడేపల్లిగూడెంలో త్వరలో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకట్రావు పాల్గొన్నారు.



పట్టిసీమ ఎత్తిపోతల పథకం ట్రయల్ రన్

పోలవరం నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టిసీమ ఎత్తిపోతల పథకానికి జలవనరులశాఖ అధికారులు శనివారం ట్రయల్ రన్ నిర్వహించారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం డెలివరీ ఛానల్ నుంచి రెండు పంపులు రెండు మోటార్లతో ట్రయల్ రన్ నిర్వహించినట్లు ఏఈ జి.వినోద్ తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యుద్ధ ప్రాతిపదికన నిర్మించి 2015 ఖరీఫ్ సీజనులో అక్టోబరు 18న నీటిని విడుదల చేశారు. ఆరంభం నుంచి నేటి వరకూ 418.3505 టీఎంసీల నీటిని పంపిణీ చేశారు.

రహదారుల అభివృద్ధికి కూటమి ప్రాధాన్యం

పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్

భీమవరం రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందని, రోడ్ల అభివృద్ధితో మెరుగైన జీవన విధానం కలగజేసే లక్ష్యంతో ముందుకెళుతున్నామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శనివారం స్థానిక చినఅమిరం కూడలిలో గుంతలు లేని రోడ్ల ఏర్పాటుకు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించి ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో రాష్ట్రంలో ఏ రోడ్డు చూసినా పెద్దపెద్ద గోతులతో ప్రయాణానికి వీలు లేని విధంగా తయారయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్లను అభివృద్ధి చేసేందుకు లక్ష్యంగా నిర్ణయించి, రాష్ట్రవ్యాప్తంగా రహదారుల్లో గుంతలు లేకుండా సమాంతరంగా మరమ్మతులు చేపట్టేందుకు పనులను ప్రారంభించామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ప్రజల పడుతున్న ఇబ్బందులను చూసి రాష్ట్రంలోని రోడ్ల గుంతలను పూడ్చే మరమ్మతు పనులకు రూ.826 కోట్లపైగా నిధులు చేశారన్నారు. జిల్లాలో రూ.1.69 కోట్ల వ్యయంతో ఏడు నియోజకవర్గాల్లోని 74 రోడ్ల మరమ్మతులకు శనివారం శ్రీకారం చుట్టామని, రానున్న వారం రోజుల్లో రూ.3.12 కోట్ల వ్యయంతో మరో 114 రోడ్లకు మరమ్మతులను సంక్రాంతి నాటికి పనులు పూర్తిచేసే లక్ష్యంతో చేపట్టామన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంతో ప్రజలకు మెరుగైన పాలన అందించడమే లక్ష్యంగా పనిచేస్తుందని దీనికి ప్రజల మద్దతు అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, ఆర్డీవో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా రహదారులు భవనాల శాఖ అధికారి ఏ శ్రీనివాస్, డీఈఈ పీవీ రామరాజు, ఏఈ రాజశేఖర్, తహసీల్దార్ రావి రవికుమార్, కూటమి నాయకులు, అధికారులు, పాల్గొన్నారు.



అడవిపాలెం వద్ద పాలకొల్లు–దొడ్డిపట్ల రహదారి మరమ్మతు పనులను ప్రారంభించి పర్యవేక్షిస్తున్న మంత్రి నిమ్మల, మాజీ ఎమ్మెల్సీ అంగర

ప్రజలు అభివృద్ధికే ఓటు వేశారు

బటన్‌లు నొక్కే జగన్‌కు ఓటు వేయలేదు : మంత్రి పార్థసారథి

దెందులూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రజలు చాలా తెలివి కలవారని వ్యక్తిగతంగా జగన్‌రెడ్డి ఎన్ని బటన్‌లు నొక్కినా.. ఓట్లు వేయలేదని అభివృద్ధి, సంక్షేమం రెండింటిని అందించకలిగి రాష్ట్రాన్ని ముందుకు తీసువెళ్లకలిగిన చంద్రబాబును ప్రజలు ఎన్నుకున్నారనే విషయం ఇప్పుడైనా వైసీపీ తెలుసుకోవాలని రాష్ట్ర సమాచారశాఖ, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. గోపన్నపాలెం పరిధిలో శనివారం రూ.13 లక్షలతో ఏలూరు- జంగారెడ్డిగూడెం రోడ్డు గుంతల పూడ్చివేత, రోడ్డు మరమ్మతు పనులను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు తట్టపట్టి రాళ్లు మోసి శంకుస్థాపన చేశారు. అనంతరం గోపన్నపాలెం గ్రామ పరిధిలో మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్ (మిల్లు బాబు) ఆధ్వర్యంలో జరిగిన గ్రామ సభలో మంత్రి మాట్లాడుతూ రోడ్లు సక్రమంగా లేకపోవడం, అవినీతి చేయడం వల్ల జగన్‌ను జనం పక్కన పెట్టారన్నారు. 2025 జనవరి నాటికి రూ.600 కోట్లతో రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లుగా చేసేందుకు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిధులు అందిస్తున్నారన్నారు. పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేస్తామన్నారు. చింతమనేని మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని పెదవేగిలో అటవీశాఖకు చెందిన 1700 ఎకరాల భూమి ఎటు కాకుండా ఉందని, దీనిని పేద మహిళలకు అరెకరం చొప్పున జీడి మొక్కలు, కూరగాయలు పెంచుకునేందుకు నామమాత్రపు లీజుతో ఇవ్వాలని మంత్రిని కోరారు. దెందులూరు నియోజకవర్గంలో రూ.22 కోట్లతో రోడ్ల మరమ్మతులు నాణ్యతతో చేయిస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ కిశోర్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మోతుకూరి నానిబాబు తదితర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గుంతలు రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతాం : మంత్రి నిమ్మల


యలమంచిలి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : రూ.800 కోట్లతో గుంతలు రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు ఎన్డీఏ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. గుంతలు రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా పాలకొల్లు-దొడ్డిపట్ల రహదారిలో రూ.30 లక్షల నిధులతో చేపడుతున్న మరమ్మతు పనులకు అడవిపాలెం వద్ద ఆయన భూమి పూజ చేసి గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించి మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో మ్యాప్‌ను చూసి కాకుండా గుంతల రోడ్లను చూసి రాష్ట్రాన్ని గుర్తించే స్థాయికి దిగజార్చిన ఘనుడు జగన్ అని విమర్శించారు. చంద్ర బాబు ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ, వాడవాడకు సీసీ రహదారులు వేసి అభివృద్ధి చేశారన్నారు. గ్రామాల నుంచి మండలాలకు, జిల్లాలకు అనుసంధానం చేస్తూ రోడ్లను అభివృద్ధి చేశారన్నారు. వచ్చే సంక్రాంతిలోపు ప్రమాదంలేని రహదారులుగా తీర్చిదిద్దుతామన్నారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ నేతృత్వంలో ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకువెళతామన్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, మామిడిశెట్టి పెద్దిరాజు, చెరుకూరి అంజిబాబు, ఆరుమిల్లి చిన్ని, కడలి గోపి, చిలుకూరి బాలాజీ, రుద్రరాజు సత్య నారాయణ రాజు, తాళ్ల నాగరాజు, పెచ్చెట్టి బాబు పాల్గొన్నారు.



శ్రీవారి సాయంకాలార్చన సమయం మార్పు

నేటి నుంచి గం. 5 నుంచి 6.30 వరకు

ద్వారకాతిరుమల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో సాయంకాల అర్చన సమయాన్ని ఆదివారం నుంచి మార్పు చేస్తున్నామని ఆలయ ఈవో ఎన్వీ ఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఇప్పటి వరకు 5.30 గంటల నుంచి ఏడు గంటల వరకు ఉండే సాయంకాలార్చన సమయం ఉంది. సూర్యాస్తమయ సమయాన్ని అనుసరించి ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు ఉంటుందని భక్తులు గమనించాలని కోరారు. భక్తులకు సాయంత్రం వేళ శ్రీవారి దర్శనం సాయంత్రం 5 గంటల వరకు సాయంకాలర్చన అనంతరం గం.6.30 గంటల నుంచి లభిస్తుందని భక్తులు గమనించాలని ఈవో తెలిపారు.



కడుపులో జుట్టును తీసి చూపుతున్న డాక్టర్

'ఆశ్రం'లో అరుదైన శస్త్ర చికిత్స

ఏలూరు టూటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆశ్రం ఆసుపత్రిలో ఒక యువతి కడుపులో ఉన్న జుట్టును లేపరోస్కోపి ఆపరేషన్ ద్వారా బయటకు తీసినట్టు సీఈవో డాక్టర్ కె.హనుమంతరావు తెలిపారు. కొల్లేరు గ్రామంలో 25 సంవత్స రాల యువతి కొంతకాలంగా జుట్టుతినే అలవాటు ఉంది. దీంతో ఆమె అనారోగ్యం పాలై ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి వచ్చింది. వైద్య పరీక్షల అనంతరం కడుపులో తల వెంట్రుకలు ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. ఆమె పొట్టలో ఉన్న సుమారు కేజీన్నర తలవెంట్రుకలను సర్జికల్ గ్యాస్ట్రో విభాగ వైద్యులు డాక్టర్ టీవీ. కృష్ణవర్ధన్ బయటకు తీశారు. ఆపరేషన్‌లో వైద్యులు లావణ్య, హర్ష, దివ్యశ్రీ పాల్గొన్నారు. అనంతరం సీఈవో హనుమంతరావు మాట్లాడుతూ ఎంతో క్లిష్టతరమైన ఆపరేషన్‌ను అతి తక్కువ ఖర్చుతో చేశామన్నారు.

కుమారుడి అదృశ్యంపై కేసు

లింగపాలెం, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడు కనిపించలేదంటూ తల్లి ఫిర్యాదు చేసిన ఫిర్యాదుపై కేసు నమెదు చేశామని ఎస్ఐ వెంకన్న తెలిపారు. రంగాపురం శివారు మెట్టగొల్లగూడెంకి చెందిన బూసి సత్య నారాయణ(28) నెల రోజులుగా కనిపించపోవడంతో ఎంత వెదికినా కనిపించకపోవడంతో అతని తల్లి నాగమణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకన్న తెలిపారు.

మోసగించిన వ్యక్తిపై పోక్సో

కైకలూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బాలికను ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి మోసగించిన వ్యక్తిపై పోక్సో చట్టప్రకారం కేసు నమోదు చేశామని కైకలూరు టౌన్ ఎస్ఐ డి.వెంకట్ కుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. కైకలూరు టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ బాలికను మండలానికి చెందిన సుగుణరావు అనే వ్యక్తి మాయమాటలు చెప్పి బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పి వేరే ప్రదేశానికి తీసుకువెళ్లి అత్యాచారానికి ప్రయత్నిస్తుండగా బాలిక కేకలు వేయగా అక్కడ నుంచి పారిపోయాడు. బాలిక ఇంటికి వెళ్లి తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లగా ఈనెల ఒకటో తేదీన తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు ముద్దాయిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

బాణసంచా క్షతగాత్రుల్లో మరొకరి మృతి

మూడుకు చేరిన మృతుల సంఖ్య

ఇరగవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం గ్రామంలో గతనెల 30న బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా గాయాల పాలైన ఐదుగురిని ఏలూరు ఆశ్రం ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఇరగవరం మండలం కావలిపురం గ్రామానికి చెందిన ఇప్పర్తి వెంకటేశ్వరరావు (56) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నా రు. నెల రోజుల క్రితమే అల్లుడు గుండె పోటుతో మృతి చెందాడు. కుమారుడి మానసిక పరిస్థితి బాగుండకపోవడంతో కుటుంబం వెంకటేశ్వర రావుపై ఆధారపడి ఉన్నది. అల్లుడి మరణించిన సంఘటన మరువక ముందే ఇంటి యజమాని మరణించడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. మానసికస్థితి బాగాలేని కుమారుడు తండ్రి మరణ వార్త విని నాన్న వచ్చేస్తున్నాడు టెంట్ వేద్దాం అంటూ అమాయకపు మాటలు విని స్థానికులు కన్నీటి పర్యంతమవుతున్నారు.



భీమవరంలో మాట్లాడుతున్న ఏసీబీ సీఐ బాలకృష్ణ

అవినీతి రహిత సమాజాన్ని నిర్మిద్దాం : సీఐ

భీమవరంటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అవినీతి రహిత సమాజాన్ని నిర్మించుకుంటేనే దేశ ప్రగతి అని ఉమ్మడి గోదావరి జిల్లాల ఏసీబీ సీఐ బాలకృష్ణ (ఏలూరు) అన్నారు. భీమవరం కేజీఆర్ఎల్ డిగ్రీ కళాశాలలో శ్రీవిజ్ఞానవేదిక, పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవినీతి నిరోధక అవగాహన వారోత్సవాలను శనివారం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ అవినీతిని అంతం చేయడంలో ఏసీబీ వేగవంతంగా పనిచేస్తుందన్నారు. అవినీతిని అరికట్టడం వల్ల సమ సమాజ స్థాపన జరుగుతుందని అన్నారు. వన్ టౌన్ పోలీసు స్టేషన్ సీఐ నాగరాజు మాట్లాడుతూ నీతి నిజాయతీతో ప్రతి వ్యక్తి ముందుకు సాగితే అవినీతిని అంతం చేయవచ్చన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ లంచగొండితనం, భూకబ్జాలు పెరిగిపోతున్నాయని, చట్టాలు ఎన్ని ఉన్నా అవినీతికి అంతం లేకుండా పోతుందని అన్నారు. అనంతరం అవినీతి వ్యతిరేక ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి గన్నాబత్తుల శ్రీనివాస్, వడుపు గోపి, పి.శేషు, తోట రామ్మూర్తి, శ్రీరామచంద్రమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

సారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ దాడులు

ఏలూరు క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లాలో సారా తయారీ కేంద్రాలపై జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం మెరుపుదాడులు నిర్వహించారు. ఏలూరు జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్ అజయ్‌కుమార్‌సింగ్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్, సిబ్బంది దాడులు కొనసాగించారు. బుట్టాయిగూడెం మండలం రావిపాడు గ్రామ పరిధిలో ఊట కాలువ, కుడి ఎడమ కాలువ గట్టుల పొదల్లో దాచి ఉంచిన 20 డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన బెల్లపు ఊట 3,800 లీటర్లను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. ఇది ఎవరు తయారు చేస్తున్నారో అధికారులు దర్యాప్తు చేపట్టారు. నందాపురం గ్రామంలో అనధికారికంగా బెల్టు షాపు నిర్వహిస్తున్న పోలూజు భవానీని అరెస్టు చేసి వారి నుంచి 29 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యలు నిమిత్తం పోలవరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించారు.



బెల్లపుఊటను స్వాధీనం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

బాలికపై అత్యాచారం !

'ఇన్‌స్టాగ్రామ్'లో యువకుడితో ప్రేమ

తిరుపతి లాడ్జిలో తొమ్మిది రోజులుగా మకాం.. 'తూర్పు' యువకుడిపై పోక్సో కేసు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఒక లాడ్జిలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ రాంకిశోర్ కథనం మేరకు.. రేణిగుంట మండలానికి చెందిన ఓ ఆటోడ్రైవర్ కుమార్తె తిరుపతిలో తొమ్మిదో తరగతి చదువుతోంది. తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం మలకపల్లికి చెందిన సతీష్ చెన్నైలోని ఒక హోటల్‌లో పనిచేస్తున్నాడు. వీరిద్దరికీ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమై ప్రేమకు దారి తీసింది. ఈ నేపథ్యంలో సతీష్ తొమ్మిది రోజుల క్రితం తిరుపతికి వచ్చాడు. తిరుపతి ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఓ లాడ్జిలో బాలికతో కలిసి మకాం వేశాడు. ఈ క్రమంలో కొద్దిరోజులుగా తమ కుమార్తె కనిపించడంలేదని బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో సీఐ రాంకిశోర్ మిస్సింగ్ కేసు నమోదు చేశారు. శనివారం వారిద్దరూ లాడ్జిలో ఉన్నట్టు గుర్తించి బాలిక తల్లిదండ్రులతో అక్కడకు వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపేశారు. అత్యాచారానికి పాల్పడినట్లు బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సతీష్‌పై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

క్రైమ్ కార్నర్

నీటి వివాదమే హత్యకు కారణమా ?

తాడేపల్లిగూడెంలో ఓ వ్యక్తి దారుణ హత్య

తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెంలో శుక్రవారం అర్ధరాత్రి ఓ వ్యక్తి దారుణహత్య పట్టణ వాసులను ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. స్థానికంగా మంచినీటి వివాదమే కారణమా ? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం. పోలీసులు తెలిపిన వివరాలివి.. తాడేపల్లిగూడెం పట్టణం వీకర్స్‌కాలనీకి చెందిన మనబాల రాజేష్(35) పెయింటింగ్ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతడికి భార్య జ్యోతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. శుక్రవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో బయటకు వెళ్లి వస్తానని చెప్పిన రాజేష్ అర్ధరాత్రి రెండో గంటల సమయంలో ఇంటి బయట కేకలు వేసుకుంటూ రక్తపు గాయాలతో గేటు ముందు పడిఉన్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు తాడేపల్లిగూడెంలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం వివరించారు. హత్య కేసుకు సంబంధించి రాజేష్ తలపై బలంగా కొట్టడడంతో పాటు చెవిని నరికినట్టు ఉందని, దీనిపై హంతకులను గుర్తించేందుకు పోలీస్ జాగిలాలు రంగంలోకి దిగినా ప్రయోజనం కనిపించలేదు. మృతుడి ఒంటి మీద వేలి ముద్రల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా రెండు రోజుల క్రితం ఇంటి పక్కన వారితో మంచినీటి విషయంలో గొడవతలెత్తిందని స్థానికులు చెబుతున్నారు. దీని ఆధారంగా నుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలుస్తోంది.



రాజేష్ (ఫైల్)

మద్యం తాగొద్దని తల్లి మందలించిందని..

యువకుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగవద్దని తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు రూరల్ మండలం వెంకటాపురం పంచాయతీ నెహ్రూనగర్ బిట్-2లో నివాసం ఉంటున్న కొయ్యా నాగరాజు (33) తన తల్లిదండ్రులతో కలిసి జీవిస్తు న్నాడు. వివాహం కాలేదు. తాపీ పనులు చేస్తుంటాడు. ఇటీవల పూటుగా మద్యం తాగుతూ ఏపని చేయకపోవడంతో తల్లి మందలించింది. శుక్రవారం రాత్రి యథావిధిగా కుటుంబ సభ్యులందరూ నిద్రించారు. తెల్లవారే సమయానికి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ సిబ్బందితో ఘట నా స్థలాన్ని పరిశీలించారు. అనుమానా స్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ఏలూరు క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గుండెకు సంబంధించి స్టంట్ ఆపరేషన్ జరిగినప్పటికీ మళ్లీ వేరే రంధ్రం ఉందని ఆపరేషన్ చేయాలని వైద్యులు నిర్ధారించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లింగపాలెం మండలం ధర్మాజీగూడానికి చెందిన షేక్ వలీ(35)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తాపీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో మూడు నెలల క్రితం ఒక ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి ఆరోగ్యశ్రీ కింద గుండెకు సంబంధించిన ఆపరేషన్ చేయించుకున్నారు. రెండు రోజులు క్రితం మళ్లీ అదే ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోగా మరో రంధ్రం ఉందని ఆపరేషన్ చేయాలని చెప్పడంతో ఆందోళనకు గురయ్యాడు. ఈనెల ఒకటో తేదీన భార్య, పిల్లల్ని అతడి అత్తవారిల్లు అయిన కామవరపుకోట మండలం కళ్ళచెరువు గ్రామానికి పంపించారు. ఒంటరిగా ఉన్న అతడు శనివారం సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకున్నారు. స్థానికులు చూసి కిందకుదించి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఈఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి వైద్యులకు సమాచారం ఇచ్చారు. ధర్మాజీగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

ఉరి వేసుకుని ఒకరి మృతి

లింగపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య కారణాలతో ఓ వ్యక్తి ఉరివేసుకుని మృతి చెందిన ఘటన లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలివి.. గ్రామంలోని మోడల్‌కాలనీకి చెందిన షేక్.వల్లీ(38) గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిపారు. వ్యాధి తీవ్రత తట్టుకోలేక శనివారం తన ఇంటిలో ఉరివేసుకోగా స్థానికులు గమనించి ధర్మాజీగూడెంలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా డాక్టర్ల సూచన మేరకు ఏలూరు ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్టు తెలిపారు.



ఏలూరు జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిందితులను వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కిశోర్

ఐదుగురు దొంగల అరెస్టు

రూ.44.20 లక్షల చోరీ సొత్తు స్వాధీనం : ఏలూరు జిల్లా ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తెలుగు రాష్ట్రాల్లో పగటి పూట ఇంటి దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు దొంగలను నూజివీడు సబ్ డివిజన్ పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 44 లక్షల 20 వేల రూపాయల విలువ గల చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారని ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్‌శివ కిశోర్ తెలిపారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. చింతలపూడి మండలం కొప్పులవారివీధికి చెందిన కొప్పుల నాగపుల్లారావు అలియాస్ చంటి, ఖమ్మం జిల్లా అశ్వారావుపేటనకు చెందిన బేలూరి హిమకర్ అలియాస్ చైతన్య, కృష్ణా జిల్లా బాపులపాడు మండలం మడిచర్లకు చెందిన భూక్యాతరుణ్, అజిమిర్ నవీన్, దుర్గా అనే వారు కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డారు. ఏలూరు జిల్లా, ఎన్టీఆర్ జిల్లాల్లో, తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా భీమ్‌చూర్ మండలంలోని పలు ప్రాంతాల్లో మొత్తం 28 దొంగతనాలకు పాల్పడ్డారు. నూజివీడు సీఐ రామకృష్ణ, నూజివీడు రూరల్ ఎస్ఐ ఎన్ లక్ష్మణబాబు, చాట్రాయి ఎస్ఐ రామకృష్ణ వారి సిబ్బంది కలిసి ప్రత్యేక బృందంగా ఏర్పడి నిఘా పెంచారు. చాట్రాయి పోలీస్ స్టేషన్ పరిధిలో వీరు అనుమానాస్పదంగా తిరుగుతుండగా శనివారం అరెస్టు చేసి వారి నుంచి 590 గ్రాముల బంగారపు వస్తువులు, 1630 గ్రాముల వెండి వస్తువులు, మూడు మోటారు సైకిళ్ళు, 60 వేల రూపాయల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారన్నారు. నిందితులు చెడు వ్యసనాలకు బానిసలై నేరాలకు పాల్పడ్డారన్నారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ ఎన్. సూర్యచంద్రరావు, నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్, నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ, రూరల్ ఎస్ఐ లక్ష్మణబాబు, చాట్రాయి ఎస్ఐ రామకృష్ణ, పెదవేగి ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు. వీరితో పాటు ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన పోలీస్ సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు.

మోటారు సైకిల్‌పై తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మోటారుసైకిల్‌పై తరలిస్తున్న మూడు క్వింటాళ్ల ప్రజాపంపిణీ బియ్యం (పీడీఎస్ రైస్)ను తాడేపల్లిగూడెంకు చెందిన రెవెన్యూ అధికారులు శనివారం నిఘాపెట్టి పట్టుకున్నారు. అక్టోబరు 29న 'వండకుండా బొక్కేస్తున్నారు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందనగా తాడేపల్లిగూడెం తహసీల్దార్ ఎం. సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో వీఆర్‌వోలతో టీమ్‌లుగా నిఘా పెట్టారు. తాడేపల్లిగూడెం నుంచి తూర్పువిప్పర్రు మోటారుసైకిల్‌పై తరలిస్తున్న మాకినీడి శ్రీనివాస్‌ను పట్టుకుని బైక్‌ను, మూడు క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

- తాడేపల్లిగూడెం పట్టణంలోని మూడు దుకాణాల్లో గ్యాస్ సిలిండర్ల ద్వారా చిన్న సిలిండర్లలోకి ఎక్కిస్తున్న వారిని వారివద్ద ఉన్న 16 సిలిండర్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో ఆర్ఐ శివప్రసాద్, వీఆర్‌వోలు మురళి, సురేష్‌కుమాఆర్, కేవీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యంతో తహసీల్దార్ సునీల్‌కుమార్

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కలిదిండి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన ఓ యువకుడు మృతి చెందిన ఘటన కోరుకొల్లులో జరిగింది. ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలివి. దెందులూరుకి చెందిన కాళిదాసు అంజిబాబు(25) కోరుకొల్లులో ఓ చికెన్ షాపులో పని చేస్తున్నాడు. పది రోజుల క్రితం పురుగు మందు తాగడంతో గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పోక్సో కేసులో వ్యాన్ డ్రైవర్ అరెస్టు

ఏలూరు క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : బాలికపై వేధింపులకు పాల్పడి కిడ్నాప్ చేసిన వ్యాన్ డ్రైవర్‌ను ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు అరెస్టు చేశారు. పెదవేగి మండలం కూచింపూడి గ్రామానికి చెందిన వ్యాన్ డ్రైవర్ పడమట వెంకటేశ్వర రావు (35) ఓ బాలికను వేధింపులకు గురి చేసి కిడ్నాప్ చేశారు. ఈ ఘటనపై ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమో దు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారు.

చినవెంకన్నకు ఎమ్మెల్యే ధర్మరాజు పూజలు



ద్వారకాతిరుమల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయాన్ని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు శనివారం సందర్శించారు. ఆయనకు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేకపూజలు చేశారు. అర్చకులు ఆయనకు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం అందజేశారు. అధికారులు ప్రసాదాలను అందించారు.

రూ.5 లక్షల విరాళం



జంగారెడ్డిగూడెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మద్ది ఆంజనేయ స్వామి ఆలయ శాశ్వత అన్నదానానికి టిడిపి సీనియర్ నాయకుడు,మాజీ తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు అబ్బిన దత్తాత్రేయ రూ.5 లక్షల చెక్కును ఎమ్మెల్యే రోషన్‌కుమార్ చేతులమీదుగా ఈఓ ఆర్‌వి.చందనకు శనివారం అందచేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోషన్‌కుమార్ అబ్బిన దత్తాత్రేయను అభినందించారు.

సైబర్ నేరాలపై జర భద్రం

లింగపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు, ఫేక్ లోన్ యాప్‌లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ధర్మాజీగూడెం ఎస్‌ఐ కె.వెంకన్న అన్నారు. విలేకర్ల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో దొంగతనాలతోపాటు, సైబర్ నేరాలు ఎక్కువయ్యాయని గేమ్స్, ఆన్ లైన్ లోన్ యాప్‌ల పేరుతో లింక్‌లు పంపి ప్రజల జేబులు గుల్లచేస్తున్నారన్నారు. ఎవరైనా ఫోన్ చేసి మీ వ్యక్తిగత వివరాలు అడిగితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

రేపు బైక్ ర్యాలీ

బుట్టాయగూడెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని, ఏజెన్సీ ప్రాంతం ఉద్యోగుల నియామక చట్టం చేయాలని కోరుతూ ఈ నెల 4న బుట్టాయగూడెంలో నిర్వహించే బైక్ ర్యాలీని ఆదివాసీలంతా విజయవంతం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ కార్యదర్శి టి.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు పి.కోవ్వాడయ్య, టి.శ్రీనివాసరావు, ఎస్.నవీన్, సీహెచ్.మహేంద్ర పాల్గొన్నారు.

అవినీతి నిరోధంపై అవగాహన

ఏలూరు అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా శనివారం స్థానిక సీఆర్‌ఆర్ కళాశాలలో అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఏలూరు జిల్లా ఏసీబీ డీఎస్పీ వి.సుబ్బరాజు మాట్లాడుతూ అవినీతి నిర్మూలనలో విద్యార్థుల పాత్ర, భాగస్వామ్యం గురించి తెలియజేశారు. ఏసీబీ విధులను వివరించారు. కరస్పాండెంట్ డాక్టర్ విష్ణుమోహన్ మాట్లాడుతూ అవినీతిలేని సమాజాన్ని తయారు చేయాలని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపాల్ రామరాజు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు మహబూబ్ బాషా, శంకర్, ఎన్‌సీసీ ఆఫీసర్ ధర్మేంద్ర, వలంటీర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఇన్‌చార్జ్‌ల నియామకం

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శనివారం ఏలూరు జిల్లాలో నిఏడు నియోజకవర్గాలకు కో ఆర్డినేటర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి ఆర్.రామ్మోహన్‌రావు, చింతలపూడికి యు.ఎలీజా, దెందులూరుకు ఎ.నరసింహమూర్తి, ఉంగుటూరుకు పి.సుబ్బారావు, నూజివీడుకు ఎం.కృష్ణ, కైకలూరుకు బి.నోబుల్, పోలవరంనకు బి.విజయభాస్కర్‌ను నియమించారు.

ఇన్‌కమ్ టాక్స్ ఇ-ఫైలింగ్ పై అవగాహన

జంగారెడ్డిగూడెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం బికామ్ విద్యార్థులకు ఇన్‌కమ్ టాక్స్ ఈ-ఫైలింగ్ పై అవగాహన కార్యక్రమం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.ప్రసాద్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. పట్టణంలోని చార్టర్డ్ అకౌంటెంట్ సంస్థ తరుపున విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గణిత పుస్తకాలు పంపిణీ



ఏలూరు రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక అగ్రహారంలోని గరల్స్ హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థినిలకు గణిత పుస్తకాలు, ఎడ్యుకేషన్ మెటీరియల్‌ను ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు ఒబ్బా శ్రావణ్‌కుమార్‌గుప్తా ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు, అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డి.జయబాబు చేతుల మీదుగా అందజేశారు. ఆర్.శివప్రసాద్, కె.రామ్మోహన్, రవి, యు.స్వామి, ఎన్.వెం కటరమణ, రెడ్డిగౌరీశంకర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భయపెడుతున్న
గ్రామ సింహాలు



లింగపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ ఎక్కువైపోతుంది. ప్రతిరోజూ ఏదో ఒక గ్రామంలో ప్రజలు కుక్కకాటుకు గురవుతూనే ఉన్నారు. విద్యార్థులు, ప్రయాణికులు, రోడ్డెక్కాలంటేనే భయపడిపోతున్నారు. కుక్కలు ఎటువైపు నుంచి వచ్చి దాడి చేస్తాయోనని హడలిపోతున్నారు. రోడ్లపై గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇటీవల ఒక పాఠశాల విద్యార్థిపై వీధి కుక్కలు దాడిచేయగా చుట్టుపక్కల వారు వాటిని తరమడంతో ప్రాణాపాయం తప్పింది. నెలకు 50 నుంచి 60 వరకు కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయి. అధికారులు స్పందించి తమను వీధి కుక్కల బారి నుంచి కాపాడాలని ప్రజలు వేడుకుంటున్నారు.

కుక్క కరిస్తే..

ఎవరైనా కుక్కకాటుకు గురైన వెంటనే గాయాన్ని నీరు ధారగా పోస్తూ సబ్బునీటితో శుభ్రంగా కడగాలని, గాయానికి ఎటువంటి కట్టుకట్టకుండా ఉంచాలని ధర్మాజీగూడెం, పీహెచ్‌సీ వైద్యురాలు యానీప్రీతి సూచించారు. వెంటనే డాక్టరును సంప్రదించి వారి సలహామేరకు మూడు నుంచి ఐదు డోసుల వరకు యాంటీరేబిస్ వ్యాక్సిన్ వేయించు కోవాలన్నారు. రేబిస్ రాకుండా డాక్టర్లు సూచించిన మందులను వాడాలని డాక్టర్ యానీప్రీతి సూచించారు.

దాతల సహకారంతో గ్రామాల అభివృద్ధి

మంత్రి కొలుసు



ఎమ్మెల్యే చింతమనేనితో కలిసి కాలక్షేప మండపాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కొలుసు

పెదవేగి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : దాతల సహకారంతో గ్రామాలు అభివృద్ధి పదాన పయనిస్తాయని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. వంగూరుకు చెందిన కాసరనేని గోపాలకృష్ణయ్య, అన్నపూర్ణమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు గ్రామంలోని శివాలయంలో రూ.10 లక్షలతో నిర్మించిన కాలక్షేప మండపాన్ని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి మంత్రి శనివారం ప్రారంభించారు. అలాగే శివాలయం ఎదురుగా ఉన్న కోనేటిలో శివపార్వతుల విగ్రహాల ఏర్పాటుకు ఆయన శంకుస్థాపన చేశారు. సర్పంచ్ చీలి రూతూ జోసఫ్, పార్టీ నాయకులు బి.సుధాకర్, టి.సత్యనారాయణ, జి.లక్ష్మీనారాయణ, ఎస్.భాస్కరరావు పాల్గొన్నారు.

● భీమడోలు :మల్లవరంలో రూ.30 లక్షలతో అభివృద్ధి పనులు చేపడతామని మంత్రి పార్థసారధి అన్నారు. యాదవ సంఘం నేత స్వర్గీయ బోయిన చినసత్యనారాయణ విగ్రహాన్ని మల్లవరంలో మంత్రి ఆవిష్కరించారు. మంత్రి పార్థసారధి మాట్లాడుతూ గ్రామ సమ స్యలను తన దృష్టికి తీసుకువస్తే జిల్లా అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఈ గ్రామం అభివృద్ధికి రూ.పది లక్షలు కేటాయిస్తానన్నారు. ఎంపీ మస్తాన్‌రావు, మాజీ ఎమ్మె ల్యే ఘంటా మురళీ, జిల్లా పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఉమ్మడి జిల్లాల గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కృష్ణయాదవ్, యాదవ సంఘ నేతలు పాల్గొన్నారు.

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు



ఏలూరు గాంధీనగర్ రామమందిరంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న మహిళలు

ఏలూరు కార్పొరేషన్/జంగారెడ్డిగూడెం/ కామవరపుకోట/ద్వారకాతిరుమల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శివాలయాల వద్ద శనివారం భక్తులు కార్తీకమా సోత్సవాలను వైభవంగా ప్రారంభించారు. వేకువజాము నుంచే శివాలయాలకు భక్తులు తరలివచ్చి అభి షేకాలు, రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించారు. ధ్వజస్తంభాల వద్ద కార్తీక దీపాలను వెలిగించారు. శివపురాణాలు పఠించారు. జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెంలోని మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీక మాస మహోత్సవాలను చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ప్రారంభించారు. ద్వారకాతిరుమల కామవరపుకోట మండలంలో కార్తీక మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తులు శివాలయాలకు చేరుకుని అభిషే కాలు, రుద్రాభిషేకాలు నిర్వహించి బిల్వార్చనలు జరిపి ధ్వజస్తంభాల వద్ద కార్తీక దీపాలను వెలిగించి ఆరాధించారు. ద్వారకాతిరుమల క్షేత్రపా లకునిగా విరాజిల్లుతోన్న భ్రమరాంబికా మల్లికార్జునస్వామి ఆలయం కార్తీక శోభను సంతరించుకుంది. కార్తీకమాసం ప్రారంభం కావడంతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మాతృ వియోగం



ఆలపాటి వనజాక్షి(ఫైల్)

పెదవేగి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సాంకేతిక విద్యాశాఖా మంత్రిగా పనిచేసిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాతృమూర్తి ఆలపాటి వనజాక్షి(98) రెండు రోజుల కిందట గుంటూరు జిల్లాలో మృతి చెందగా, వారి స్వగ్రామం ఏలూర ుజిల్లా పెదవేగి మండలం లక్ష్మీపురంలో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. వనజాక్షి అంత్యక్రియలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాతోపాటు ఉమ్మడి, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల నుంచి రాజకీయ ప్రముఖులు భారీగా తరలివచ్చారు. రాజేంద్రప్రసాద్ తండ్రి ఆలపాటి శివరామకృష్ణయ్య స్వాతంత్ర్య సమర యోధుడు. వారికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా, రాజేంద్ర ప్రసాద్ ద్వితీయ సంతా నం. వనజాక్షి భౌతిక కాయా నికి స్థానిక ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యే లు, ఇతర ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలు ఉంచి, నివాళులర్పించారు. రాజేంద్రప్రసాద్ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

అవినీతి నిర్మూలన అలవాటు చేసుకోవాలి

ఏలూరు క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అవినీతి నిర్మూలన చిన్ననాటి నుంచి అలవాటు చేసుకోవాలని జిల్లా నెహ్రూ కేంద్ర యువజన అధికారి డి.కిషోర్ అన్నారు. భారత ప్రభుత్వం కేంద్రీయ విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు కేంద్రీయ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్ర ఏలూరు ఆధ్వర్యంలో అక్టోబర్ 28 నుంచి నవంబర్ 3 వరకూ నిఘా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన అధికారి కిషోర్ తెలిపారు. దీనిలో భాగంగా ఏలూరు కోట దిబ్బ వద్ద ఉన్న ప్రభుత్వ కళాశాలల్లో కల్చర్ ఆఫ్ ఇంటిగ్రేటి ఫర్ నేషన్ ప్రాస్పారిటీ అనే నినాదంతో నిఘా వారోత్సవాల సభను శనివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ (ఇన్‌ఛార్జి) డాక్టర్ ఎం.రాంబాబు, సిబ్బంది డాక్టర్ ఎం విజయ్‌కుమార్, సీఎం కృష్ణ చైతన్య, డాక్టర్ కావ్య శ్రీ, ఈవీఎస్ పద్మావతి, ఎన్ శేషాలతలు మాట్లాడారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఏలూరు క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు అన్నారు. ఏలూరు వన్ టౌన్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న టెక్నో స్కూల్ విద్యార్థులకు శనివారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సును ఏలూరు ట్రాఫిక్ పోలీసులు నిర్వహించారు. సీఐ లక్ష్మణరావు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి కళాకారుల సమస్యలు

ఏలూరు రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కళాకారుల సమస్యలు సాంస్కృతి కశాఖా మంత్రి కందుల దుర్గేష్ దృష్టికి తీసుకువెళ్లి పరి ష్కారానికి కృషి చేస్తానని జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డిఅప్పల నాయుడు హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ సకల కళాకారుల సంక్షేమ సంఘం 8వ రాష్ట్ర మహాసభ శనివారం శ్రీసెలానాగ కోటేశ్వరరావు కల్యాణ మండపంలో ఘనంగా జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు డి.రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రెడ్డి అప్పలనాయుడు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కార్యదర్శి నాగ శ్రీనివాస్, సంస్థ కార్యక్రమాలను వివరించారు. టీడీపీ నాయ కులు ఎస్.బుజ్జి, రాష్ట్ర నాయకులు కె.గోవింద రావు, జగన్, వివిధ జిల్లాల అధ్యక్షులు టి.మాధవరావు, నాగేశ్వరరావు అనంతరం అభినయ నృత్యభారతి విద్యార్థులు కూచిపూడి నాట్యప దర్శనలు ఆకట్టుకున్నాయి.

ప్రకృతి సాగులోకి మారండి

చింతలపూడి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రానున్న రోజుల్లో రైతులు ప్రకృతి సాగుకు మొగ్గు చూపాలని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ విజయకుమార్ పేర్కొన్నారు. యర్రంపల్లిలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న దేశీయ వరి పంటను ఆయన పరిశీలించారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి.తాతారావు, చింతలపూడి సహాయ వ్యవసాయ సంచాలకులు నాగకుమార్ ఉన్నారు.

మాజీ మంత్రి దివంగత యర్రన్నాయుడి వర్ధంతి



జంగారెడ్డిగూడెంలో ఎర్రన్నాయుడు నివాళులర్పిస్తున్న నాయకులు

ఉంగుటూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : దివంగత కేంద్ర మంత్రి కింజరాపు యర్రన్నాయుడి వర్ధంతిని శనివారం కైకరం ఎన్టీఆర్ చౌక్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. జెడ్పీటీసీ మాజీ శ్రీనివాస్, సర్పంచ్ ఎస్.గోపి, మాజీ సర్పంచ్, తెలుగుదేశం ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వై.సుజీవ రావు,మాజీ ఎంపీటీసీ జి.తిరుపతయ్య, పి.సత్తి బాబు, ఎస్.రామాంజనేయులు, జి.నాగు నివాళులర్పించారు.

● జంగారెడ్డిగూడెం : పట్టణ టీడీపీ కార్యాలయంలో మాజీ కేంద్ర మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు 12 వర్ధంతిని పట్టణ పార్టీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. టీడీపీ నాయకులు ఆర్.సత్యనారాయణ(పండు), టి.రాము ఎర్రన్నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీహెచ్.తాతాజీ, సీహెచ్.ప్రసాద్, ఎస్.ప్రసాద్, ఎస్‌కే యాకూబ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించండి



వసతి గృహంలోని ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న జడ్జి రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల నాణ్యతలో రాజీపడవద్దని బాల్యంలో మంచి పోషకాహారాన్ని అందించాల్సిన బాధ్యత వ్యవస్థపై ఉందని జిల్లా న్యాయ సేవా ధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ అన్నారు. శనివారపుపేటలో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని శనివారం జడ్జి రత్న ప్రసాద్ సందర్శించారు. వసతి గృహంలోని సదుపాయాలు, పరిశుభ్రత, గృహ నిర్వాహణను పరిశీలించారు.

డిసెంబరు 14న లోక్ అదాలత్

రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్‌ను డిసెంబరు 14న నిర్వహిస్తున్నారని జడ్జి రత్న ప్రసాద్ తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోదగిన అన్ని సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకోవచ్చునని సూచించారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకుని కేసు నుంచి విముక్తి పొందాలని సూచించారు.

బాధితులకు న్యాయం చేయాలి

ఏలూరు రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): లింగపాలెం మండలంలో ఆక్రమణకు గురైన సాగు భూమిపై సమగ్ర విచారణ జరిపి బాధి తులకు న్యాయం చేయాలని, దళితసేన వ్యవ స్థాపక అధ్యక్షుడు జి.రవిప్రకాష్, జిల్లా రెవె న్యూ అధికారిని కలిసి వినతిపత్రం అంద చేశారు. లింగపాలెం మండలం మటంగూడెం గ్రామానికి చెందిన గాదినబోయిన చంద్రశేఖర్ సాగుభూమి ఇటీవల ఆక్రమణకు గురైందని, అతని భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, ఈ విషయం పై సమగ్ర విచారణ జరిపించి, బాధితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.చంటి పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

ఏలూరు రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అదిరోహిం చవచ్చనని ఏలూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎం.చలపతిరావు అన్నారు. స్థానిక శ్రీరామ్‌నగర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏలూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్య ంలో ఆ పాఠశాల బెస్ట్ క్లాస్ స్టూడెంట్ అవార్డు కార్యక్రమం శనివారం నిర్వహించారు. విద్యార్థులకు అవార్డులు, ప్రశంసాపత్రాలు అందచేశా రు. కార్యదర్శి కె.బాలకృష్ణ, ట్రెజరర్ టి.సాయి కృష్ణ సుహాస్, పాఠశాల హెచ్‌ఎం బి.సుదర్శ నం, విద్యాకమిటీ ఛైర్మన్ ఎస్.ఊర్మిళ పాల్గొన్నారు.

తపనా చౌదరి పుట్టిన రోజు వేడుకలు



ఆలయంలో పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

ఏలూరు రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపనా ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి పుట్టిన రోజు సందర్భంగా శనివారం ఏలూరు కొత్తపేటలోని నూకాలమ్మ ఆలయంలో జిల్లా బీజేపీ, బీజేవైఎం నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌కిషోర్, ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ కట్నేని కృష్ణప్రసాద్, గాది రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

● భీమడోలు : తపన ఫౌండేషన్ అధినేత గారపాటి సీతారామాంజనేయ చౌదరి జన్మదిన వేడుకలు భీమడోలులోని శ్రీనివాసా కల్యాణ మండపంలో ఘనంగా జరిగాయి. ఉంగుటూరు నియోజకవర్గ కో కన్వీనర్ ధర్మారావు జన్మదిన కేక్ కట్ చేశారు. సీతారామాంజనేయ చౌదరికి శుభాకా ంక్షలు తెలిపారు. బీజేపీ నేతలు వీరరాఘవులు, సత్తిబాబు, రాళ్ళపల్లి రామరాజు, కోటేశ్వరరావు, చిన్నారావు, పాల్గొన్నారు.

ఐదేళ్ల తరువాత అభివృద్ధి, సంక్షేమం ప్రారంభం



జీలుగుమిల్లిలో ఉచిత గ్యాస్ పంపిణీలో ఎమ్మెల్యే బాలరాజు



ఏలూరులో రహదారుల గుంతలు పూడుస్తున్న ఎమ్మెల్యే చంటి



తిమ్మాపురంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

ఎమ్మెల్యేలు రోషన్‌కుమార్, చంటి, బాలరాజు

ఏలూరు టూ టౌన్ : ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అన్నారు. విజయలక్ష్మి థియేటర్ వద్ద రోడ్ల పై ఉన్న గుంతలకు మరమ్మతు పనులను మేయర్ నూర్జహాన్‌తో కలిసి చంటి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే చంటి మాట్లాడు తూ అభివృద్ధి, సంక్షేమం రెండిటికి తమ ప్రభుత్వ సమప్రధాన్యత ఇస్తుందన్నారు. జనవరి నెలఖరు నాటికి గుంతలన్ని పూడుస్తామన్నారు. అనం తరం కొత్త రోడ్లు వేసేందుకు రూ.10 కోట్లు మంజూరు చేశామన్నారు. కమిషనర్ కె.భానుప్ర తాప్, సీహెచ్.వెంకటరత్నం, ఎస్ఎంఆర్ పెదబా బు, ఎం.హనుమంతరావు, మురళీకృష్ణ, నాగరాజు, ఎస్ఈ రాజేంద్రకృష్ణ, డీఈలు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమానికి పెద్దపీట

లింగపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఐదేళ్ల తర్వాత అభివృద్ధి పనులు మొదలయ్యాయని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రోడ్లు పెద్దపెద్ద గుంతలతో అధ్వానంగా ఉన్నాయని ఆయన మండిపడ్డారు. కె.గోకవరంలో రోడ్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శనివారం శ్రీకారం చుట్టారు. ప్రజలకు మెరుగైన పాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. జి.చలపతిరావు, ఎం.మల్లికార్జునరావు, వై.శ్రీనివాసరావు, ఎం.రాము, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి ప్రభుత్వం కృషి

జీలుగుమిలి : దీపం-2 ఉచిత గ్యాస్ పంపిణీ కార్యక్రమం జీలుగుమిల్లిలో హెచ్‌పీ గ్యాస్ ఆఫీసు వద్ద ఎమ్మెల్యే చిర్రి బాలరాజు చేతుల మీదుగా ప్రారంభించారు. అర్హులైన మహిళలకు ఉచిత గ్యాస్ సరఫరా చేశారు. ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లో హామీలను అమలు చేస్తున్నారన్నారు. కూటమి మండల అధ్యక్షుడు ఎస్.సాయి, పి.రాము, కేపీఎల్ ప్రసాద్, తహసీల్దారు బి.సందీప్, ఎంపీటీసీ ఎస్.శ్రీను పాల్గొన్నారు.

పశుగణనకు సహకరించాలి

ద్వారకాతిరుమల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి పశుసంవర్ధక సిబ్బంది వచ్చి పశు గణన కార్యక్రమం చేపడతారని, ఇంట గుమ్మానికి స్టిక్కర్లు కూడా అతికిస్తారని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు తెలిపారు. తిమ్మాపురంలో 21వ అఖిల భారత పశుగణన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి పశుగణనను ప్రారంభించి మాట్లాడారు. మండల పశువైద్యులు ఎ.సురేష్ నేతలు ఎల్.సత్తిపండు, పి.శ్రీను, పాల్గొన్నారు. ఎం.నాగుల పల్లిలో పశుగణన కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ జి.నెహ్రూబాబు తనిఖీ చేశారు.

త్వరలో డీఎంహెచ్‌వో బదిలీ ?

ఏలూరు అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.శర్మిష్ట బదిలీ కానున్నట్టు వైద్యఆరోగ్య శాఖ వర్గాల్లో ప్రచారం జోరందుకుంది. రాగల వారం రోజుల్లో ఈ బదిలీ జరుగనున్నట్టు సమాచారం. వాస్తవానికి జిల్లానుంచి స్వచ్ఛందంగానే ఆమె బదిలీ కోరుకుంటున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుతీరిన నేపథ్యంలో అన్ని శాఖల జిల్లాల హెచ్‌వోడీలను బదిలీచేస్తున్న క్రమంలోనే డీఎంహెచ్‌వోల బదిలీలు కూడా జరుగుతాయని గత నెలలో ప్రచారం జరిగింది. దీనికి సంబంధించి కసరత్తు కూడా ఇప్పటికే పూర్తయిందని, ఈ నెల 7లోగా బదిలీలు జరిగే అవకాశాలున్నట్టు సమాచారం. కొందరికి పదోన్నతులు ఇవ్వడం ద్వారా రాష్ట్ర కార్యాలయంలోను, మరికొందరిని డీఎంహెచ్‌వోలుగాను నియమించనున్నట్టు తెలిసింది. కాగా ఏడాది లోపే ఉద్యోగ విరమణ చేయనున్న డాక్టర్ శర్మిష్ట రిటైర్ అయ్యేవరకు జిల్లాలోనే కొనసాగుతారనే ప్రచారం కూడా ఉంది. అయితే ఈ బదిలీలపై అధికారిక సమాచారమేదీ లేదు.

పాత పద్ధతినే కొనసాగించండి



విద్య డైరెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న డీపీఆర్టీయూ నాయకుడు

ఏలూరు అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జీవో 117 ఉత్తర్వుల రద్దుస్థానే ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయాలని, పూర్వపు పద్ధతిలోనే ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల వ్యవస్థను కూటమి ప్రభుత్వం పునఃప్రారంభించాలంటూ డెమొక్రటిక్ పీఆర్టీయూ నాయకులు విజయవాడలోని పాఠశాల విద్య డైరెక్టర్ పి.పార్వతికి విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు, రేషనలైజేషన్‌లను చేపట్టేందుకు ప్రభుత్వం త్వరలో చట్టాన్ని చేయనున్న నేపథ్యంలో ఉపాధ్యాయ సంఘాల తరపున తమ సూచనలు, సలహాలను వినతి పత్రం రూపంలో అందజేశారు. వివరాలను సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు ఇక్కడి పత్రికలకు తెలిపారు. అర్హతలు కలిగిన స్కూల్ అసిస్టెంట్లకు పూర్తిస్థాయి పీఈటీలుగా పదోన్నతులు కల్పించాలని, హైస్కూల్ ప్లస్‌లకు సీనియర్ ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్స్‌గా నియమించాలని, వేసవి సెలవుల్లో మాత్రమే బదిలీలు, రేషనలైజేషన్ చేపట్టాలని, నెలవారీ పదోన్నతులను కొనసాగించాలని తదితర వాటిని చేపట్టాలని అభ్యర్థించారు. డైరెక్టర్‌ను కలిసినవారిలో డీపీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను, తదితరులు ఉన్నారు.

స్కిల్ సెన్సెస్‌పై ఒక్కరోజు శిక్షణ

పెదపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులు ఏఏ రంగాల్లో నైపుణ్యం కలిగి ఉన్నారో గుర్తించి వారికి సరైన ఉపాధి అవకాశ కల్పన దిశగా చర్యలు తీసుకునేందుకు చర్యలు చేపట్టాలని పెదపాడు ఎంపీడీవో అమిలు జామా అన్నారు. పెదపాడు ఎంపీడీవో కార్యాలయంలో స్కిల్ సెన్సస్ కార్యక్రమంపై సచివాలయ సిబ్బందికి శనివారం ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో అమిలు జమ మాట్లాడుతూ నైపుణ్యత ఆధారంగా యువతీ యువకులను గుర్తించి వారిని స్కిల్ సెన్సస్ కార్యక్రమంలో జాయిన్ చేసి పెదపాడు మండలాన్ని జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలబెట్టాలని సూచించారు. ఇందుకు సంబంధించిన పలు అంశాలపై సిబ్బందికి శిక్షణను అందించారు. ఎంపీడీవో కార్యాలయ ఏవో రవికుమార్, ఇవో మైనేని వెంకటేశ్వరరావు, ట్రైనీలు రవి, రాకేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఇండియా క్రిస్టియన్ మిషన్ చర్చ్ వార్షికోత్సవం



బిషప్ జాన్ ఎస్‌డీ రాజు

ఏలూరు టూ టౌన్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): ఇండియా క్రిస్టియన్ మిషన్ చర్చ్ 127వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించినట్లు ఐసీఎం చర్చ్ బిషప్ మోస్ట్ రెవరెండ్ జాన్‌ఎస్‌డీ రాజు అన్నారు. ఏలూరు ఐసీఎం చర్చ్ ప్రధాన కార్యాలయంలో దేవునికి మహిమాన్వితంగా జరిగినట్లు బిషప్ వివరించారు. ముందుగా బిషప్ జాన్‌ఎస్‌డీ రాజు పతాకావిష్కరణ చేశారు. కృష్ణా, గోదావరి అధ్యక్ష పీటం తరఫున కార్యదర్శి ఎన్ వైపీ ప్రసాద్ వార్షిక నివేదికను ప్రవేశపెట్టారు. ఐసీఎం సంఘాల అభివృద్ధి, పాఠశాలలు, సంఘ సేవలను వివరించారు. కార్యక్రమంలో పశ్చిమబెంగాల్ పీటం బిషప్ అగస్టీన్ సుకుమార్, పంజాబ్ పీటం వికార్ జనరల్ శ్యామ్‌సన్, ఉత్తరాఖండ్, తెలంగాణ, త్రిపుర, శ్రీలంక, అమెరికా, కెనడ, ఫ్రాన్స్‌పీటాలకు వార్షిక నివేదిక మెయిల్ ద్వారా వచ్చినట్లు వివరించారు. భోగోలు సంఘం యవ్వనస్తులు క్వైయర్ నిర్వహించారు. ఉపాధ్యాయులు, డీనరి చైర్మన్‌లు, ట్రస్ట్ బోర్డు సభ్యులు, సండే స్కూల్ విద్యార్థులు, డి.సువర్ణరాజు, డాక్టర్ జాన్‌లియో, రెవరెండ్ బి.యోబు, తదితరులు పాల్గొన్నారు.

తోళ్ల పరిశ్రమను పారంభించాలి

ఏలూరు టూ టౌన్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో మూతబడిన తోళ్ల పరిశ్రమలు, చర్మాల కొనుగోలు కేంద్రాలు తిరిగి ప్రారంభించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని చర్మకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి.హరికృష్ణ డిమాండ్ చేశారు. గన్‌బజార్ సంఘ కార్యాలయంలో శనివారం హరికృష్ణ మాట్లాడుతూ రెండు రాష్ట్రాల్లో చర్మకారులు, డప్పు కళాకారుల జీవన స్థితిగతులు అధ్వానంగా తయార య్యాయన్నారు. వీరి జీవన స్థితిగతులు తెలియజేసేందుకు త్వరలో జాతీయ చర్మకారుల సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. టి.సురేష్, ఎస్.ప్రకాశరావు, సీహెచ్.దుర్గారావు, సుబ్బారావు, నాగరాజు, కె.రవి పాల్గొన్నారు.

అప్పులు.. తిప్పలు!



- అప్పు చేసి పప్పుకూడు సామెత పోయే .. ప్రతి ఇంటా అప్పుల కుప్పలే
- పెరుగుతున్న అవసరాలు.. ఆర్భాటాలు..
- ఇంటిల్లాలు దగ్గర నుంచి పిల్లల వరకు అప్పులే
- రెచ్చిపోతున్న కాల్‌నాగ్‌లు..
- ఏటా వందల మంది ఉసురు

ఆంధ్రజ్యోతి సండే స్పెషల్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :
ఒకానొకప్పుడు ఉమ్మడి కుటుంబాలు వర్ధిల్లిన నాడు అప్పంటేనే ఆ కుటుంబాలన్నీ వణికిపోయేవి. ఆ పరిస్థితి రాకూడదని దేవుళ్ళకు మొక్కేవారు. ఉన్నదానిలోనే సరిపెట్టుకోవడమే తప్ప అప్పు జోలికి వెళ్ళేందుకే జంకు. అంతకంటే మించి అప్పు తీసుకుంటే ఆ కుటుంబానికి అప్రదిష్టే. సమాజంలో పెద్దింటిగా మెలిగినవారికి ఈ పరిస్థితి నామోషీగా ఉండేది. తమ హీన స్థితికి ఇదొక నిదర్శనంగా భావించేవారు. కష్టించి పనిచేయడమే ధ్యేయంగా మెలిగిన రోజుల్లో అత్యవసరాల్లో తప్ప చేబదులుకు కూడా చేయిచాచని కుటుంబాలు లెక్కకు మిక్కిలి. అప్పట్లో ఇంటి పెద్దే అన్ని పద్దులు సరిచూసు కునేవారు. ఎవరికెంత కావాలో.. ఏడాదికి ఎంత ఖర్చో అంచనాకు వచ్చేవారు.

పెళ్ళైనా.. పేరంటమైనా సోకులకు పోయేవారు కాదు. ఆర్థికంగా కొంత స్థిమితపడి క్రమశిక్షణగా మెలిగే కుటుంబాలను అప్పటికీ, ఇప్పటికీ కూడా పిసినారి బోర్డు తగిలిస్తారు. అదే స్తోమతకు మించి అప్పులు చేసి సోకులకు పోయేవారిని చూసి మురిసిపోతారు. రానురాను ఇంటి ఖర్చులు పెరుగుతూ పోతున్నాయి. రానురాను ఇవి కాస్తా పెరిగి ఉమ్మడి కుటుంబాలు రకరకాల కారణాలతో విచ్ఛిన్నమయ్యాయి. ఆ స్థానంలో ఒంటరి కుటుంబాలు వచ్చాయి. సరిగ్గా ఇక్కడే సొంత ఆర్థిక వ్యవస్థ తిరగబడింది. ఆస్తులు, అంతస్తులన్నీ ఎవరంతట వారుగా పంచుకుని వేరుపడ్డారు. మనసులు విరిగి.. బంధాలు కరిగి.. ఒకప్పటి ఆనందాన్ని అంతం చేసుకుని.. పొరుగింటి వారే తమకు ఆదర్శంగా మలుచుకుని చేతినిండా ఖర్చులు.. ఆపై అప్పులు. ఇంకేముంది అప్పు తీరే మార్గంలేక చితికిపోయిన సంసారాలెన్నో ఉన్నాయి.

ఇంటింటా అప్పులు

అప్పు చేయకపోవడం ఒకప్పటి ధర్మం. ఇప్పుడు అప్పే చేసి ఇంటిని సాకడం మరో ధర్మం. ఏకంగా ఇంట్లో మహిళా మణులే నిరంతర ఆదా చేసేవారుగా ఇంతకుముందు ఓ గుర్తింపు. అందుకనే ఇంట్లో ఆడవారు క్రమశిక్షణగా ఉంటే ఆ ఇంటికి తిరుగుండదని తెగ గొప్పలు చెప్పేవారు. కాని ఇప్పుడు ప్రతి కుటుంబానికి ఓ అప్పు ప్రభుత్వమే సమకూరుస్తుంది. త్వరగా కడితే ఇంకో అప్పు. ఇచ్చే అంతటికి తక్కువ వడ్డీ అంటూ ఏటా ఓ ఆఫర్. జిల్లా వ్యాప్తంగా ఉన్న 43 వేల పొదుపు సంఘాలు ఉండగా వీటిలో 4 లక్షల 30 వేల మందికిపైగా మహిళలే సభ్యులు. వీరంతా కలిసి ఏడాదికి బ్యాంకుల నుంచి సుమారు రూ.1100 కోట్ల నుంచి 1200 కోట్లు అప్పుగా తీసుకుంటారు. ఉమ్మడిగా ప్రతి నెలా వాయిదా పద్ధతిన బ్యాంకుల్లో చెల్లిస్తూనే వస్తారు. ఈ సొమ్ములతోనే జీవనోపాధికి అవకాశం అంటూ సర్కార్ యోచిస్తుంటే వీరిలో కొందరు తాము తీసుకున్న తక్కువ వడ్డీ సొమ్మును తిరిగి ఎక్కువ వడ్డీకి తిప్పుతుంటారు. బయట వడ్డీ రూపాయిన్నర నుంచి మూడు రూపాయల పైమాటే. అవసరాన్ని బట్టి కొందరు ఈ అప్పుల వైపు చేయి చాపుతారు. ఒకప్పుడు ఈ పొదుపు సంఘాలన్నింటికి ఏడాదికి ఐదొందలు నుంచి ఆరొందలు కోట్లు వరకు ఉండే రుణం కాస్తా ఇప్పుడు రెట్టింపు కావడం ఒక విచిత్రమైతే తాము తీసుకున్న అప్పును ఇంకొకరికి అప్పుగా ఇచ్చి రుణ గ్రహీతల సంఖ్యను వీరంతా రెట్టింపు చేస్తున్నారు. అంటే సరాసరిన ప్రతీ ఇంట్లోను ఓ అప్పు ఉన్నట్టే. దీనికితోడు సొంతిల్లు ఉంటే అదే పదివేలు. ఇంకేముంది బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. రుణం పొందితే చాలు కల్లో.. గెంజోతాగి సొంతింట్లోనే బతకొచ్చనే కల నిజమయ్యేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగుల తోపాటు మిగతా అన్ని తరగతులది ఇదే తాపత్రయం. దీంతో ఈ జిల్లాలోనే ఏడాది పొడవునా గృహ అవసరాల కోసం ఇచ్చే రుణాల సంఖ్య రూ.1300 కోట్లు దాటింది. ఇదొకనాడు ఒక వంతుగానే ఉండేది. ఇప్పుడు నెల వచ్చిపడితే చాలు.. అమ్మో ఇఎంఐ(ప్రతినెలా చెల్లింపు) పేరిట గగ్గోలు పెట్టాల్సిందే. ఇది ఒక ఏడాది కాదు.. 13 నుంచి 15 ఏళ్ళ సుదీర్ఘ అప్పు పోరాటం చేయాల్సిందే. సాధారణంగా అద్దె ఇళ్ళల్లో ఉంటే నెలకు సరాసరిన 7 నుంచి 11 వేలలోపు అద్దె చెల్లిస్తే సరిపోతుంది. కాని ఈఎంఐ వైపు తొంగి చూసినవారంతా 25 నుంచి 34 వేల రూపాయల వరకు సరాసరిన నెలవారీ కిస్తులు బ్యాంకులకు చెల్లించాల్సిందే. ఇదికాకుండా అనేక కుటుంబాలు తమ స్తోమతకు మించి మరీ అప్పులు చేస్తున్నాయి. ఉదహరణకు ఇంట్లో టివి, రిఫ్రిజిరేటర్ ఉంటే చాలను కునేవారు. ఇప్పుడా ట్రెండ్ కాస్తా మారీ ఇంకో వైపు ఒంగి చూస్తుంది. ఇల్లు అంటూ ఉంటే చాలు ఏకంగా ఏసీ, వాషింగ్ మిషన్, హీటర్ తోపాటు మరిన్ని గృహోపక రణాలు కూడా అత్యవసరమే. ఇక చేసేదేముంది. ముంద స్తుగా పెట్టుబ డి పెట్టే ప్రైవేటు కంపెనీలు ఎలాగూ ఉన్నాయి. వీటికి తల తాకట్టు పెట్టినా నెలవారీ చెల్లింపు చేయాల్సిందే. ఇంకోవైపు కార్లు, బైక్‌లకు కోట్లాది రూపాయలు అప్పులు చేసే కుటుంబాలు వేలల్లోనే కనిపిస్తున్నాయి. ఒక్క ఏలూరు జిల్లాలోనే ప్రతి ఏటా మూడు వేల కోట్లు వీటి కోసమే ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీల్లో ఉన్న వారైనా లేకుంటే మధ్య తరగతి అయినా అప్పు చేయాల్సిందేనని అంతలా అప్పుకు అలవాటు పడిపోయారు.

● అప్పులు లేకుండా బతకలేం



అప్పులు చేయకుండా బతకడం కష్టమే అంటారు చాలా మంది. ఎప్పుడైనా డబ్బు అవసరం కావొచ్చు. ఇలాంటి సమయంలో ఖచ్చితంగా అప్పులు చేయాల్సి వస్తుంది కదా. నేను, నా భర్త కష్టపడినా వచ్చే సొమ్ము సరిపోదు. అప్పులు చేయడం, తీర్చడం షరా మామూలు అయిపోయింది.

బి. రమాదేవి, ఏలూరు

● అప్పులు చేయడం మామూలే



అప్పులు చేయడం, తీర్చడం మామూలే. వ్యాపార రీత్యా అవసరం అలా చేయిస్తుంది. కొన్ని సమయాల్లో అప్పులు తప్పక చేయాల్సి వస్తుంది. ప్రస్తుత పరిస్థితుల్లో సామాన్య, మధ్యతరగతి ప్రజలు జీవించడం కష్టంగా మారింది. ప్రతి వస్తువు ధర పెరిగింది. నిత్యావసరాలతో పాటు సామాన్య మానవుడు జీవన స్థితిగతులు మాత్రం మారడంలేదు. ఆదాయం పెరగడంలేదు.

ఎం.రాజు, ఏలూరు

కాలనాగులెన్నో..

రోజులు మారాయి.. అవసరాలు పెరిగాయి. అత్యవసరాలు రెండింతలయ్యాయి. క్షణాల్లో సొమ్ము చేతికందాలి. దానికి ఎంత వడ్డీ అయినా పర్వాలేదు. అలాంటి ట్రెండ్ ఇప్పుడు కొందరి పాలిట శాపం అవుతుంది. ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలన్నీ విలనిజం పాటిస్తున్నాయి. ముందుగా అప్పు తీసుకునే వారందరికీ మీ ఆధార్ కార్డు ఒక్కటిస్తే చాలని బిస్కెట్ విసిరి ఆ తరువాత రకరకాలుగా షరతులతో సంతకాలు చేయించుకుంటారు. ఇంకేముంది ఒక్క నెలలోనే కడితే తక్కువ వడ్డీ అని చెప్పి రానురాను ఇచ్చిన సొమ్ము అంతా వడ్డీకే సరిపోయింది అసలు ఎక్కడెంటూ నిత్యం వేధింపులు. గూండాలు, రౌడీలతో బెదిరింపులు. అంతకంటే మించి రెచ్చిపోయిన ఇంకొందరు మహిళలపై లైంగిక వేధింపులకు తోడు అవమానాలు. చీటికి మాటికి ఇంటి వద్ద వాలిపోవడం, ఇరుగుపొరుగువారితో చర్చించడం, ఇంటి పరువుని బజారుకెక్కించడంలో వీరు దిట్ట. తమకు ఇవ్వాల్సిన అప్పు వసూలు కోసం ఎంతకైనా బరితెగిస్తారు. కాల్‌మనీ వ్యాపారం మధ్య తరగతి కుటుంబాలను చిన్నాభిన్నం చేసింది. ఈ ఒక్క ఏడాదిలోనే ఈ తరహా కేసులు పదుల సంఖ్యలో పోలీసుల దృష్టికి వెళ్ళగా మిగతా కేసులన్నీ ఎక్కడికక్కడే మిగిలిపోయాయి. ఆఖరుకి ప్రైవేటు ఫైనాన్సర్లు బరితెగించి భౌతికదాడులకు తెగబడిన సంఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అనేక మంది ఉసురు తీసుకుంటున్నారు.

ప్రజలు అభివృద్ధికే ఓటు వేశారు

దెందులూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రజలు చాలా తెలివి కలవారని వ్యక్తిగతంగా జగన్‌రెడ్డి ఎన్ని బటన్‌లు నొక్కినా.. ఓట్లు వేయలేదని అభివృద్ధి, సంక్షేమం రెండింటిని అందించకలిగి రాష్ట్రాన్ని ముందుకు తీసువెళ్ల కలిగిన చంద్రబాబును ప్రజలు ఎన్ను కున్నారనే విషయం ఇప్పుడైనా వైసీపీ తెలుసు కోవాలని రాష్ట్ర సమాచార శాఖ, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. గోపన్నపాలెం పరిధిలో శనివారం రూ.13 లక్షలతో ఏలూరు-జంగారెడ్డిగూడెం రోడ్డు గుంతల పూడ్చివేత, రోడ్డు మరమ్మతు పనులను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు తట్టపట్టి రాళ్ళు మోసి శంకుస్థాపన చేశారు. అనంతరం గోపన్నపాలెం గ్రామ పరిధిలో మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్ (మిల్లు బాబు) ఆధ్వర్యంలో జరిగిన గ్రామ సభలో మంత్రి మాట్లాడుతూ రోడ్లు సక్రమంగా లేకపోవడం, అవినీతి చేయడం వల్ల జగన్‌ను జనం పక్కన పెట్టారన్నారు. చింతమనేని మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని పెదవేగిలో అటవీశాఖకు చెందిన 1700 ఎకరాల భూమి ఎటు కాకుండా ఉందని, దీనిని పేద మహిళలకు అరెకరం చొప్పున జీడి మొక్కలు, కూరగాయలు పెంచుకునేందుకు నామమాత్రపు లీజుతో ఇవ్వాలని మంత్రిని కోరారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ కిశోర్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మోతుకూరి నానిబాబు తదితర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

హడావుడిగా
వరి కోతలు

వర్షం భయంతో కోతలు.. జోరుగా పచ్చి ధాన్యం అమ్మకాలు
ధర తగ్గించారంటున్న అన్నదాతలు


చాట్రాయిలో రోడ్డు పక్కన తూకానికి వేసిన పచ్చి ధాన్యం రాశులు

చాట్రాయి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మబ్బుల వాతావరణం కొనసాగుతుండటంతో రైతులు హడావుడిగా వరికోతలు కోసి పచ్చి ధాన్యం విక్రయిస్తున్నారు. వరి పంట కోతకు రావటం వలన పెద్ద వర్షాలు పడితే నష్టపోతామనే భయంతో రైతులు ముమ్మరంగా కోతలు చేపట్టారు. చాట్రాయిలో సుమారు రెండు వేల ఎకరాల్లో రైతులు గత కొన్నేళ్ల నుంచి నెల ముందుగా ఖరీఫ్ వరి, రబీ మొక్కజొన్న సాగు చేస్తూ లాభాలు పొందుతున్నారు. వరి పంట కోతకు రావడంతో యంత్రాలతో కోతలు కోసి 75 కేజీల బస్తా రూ.1,420కి విక్రయిస్తున్నారు. ఈ ధరకు అమ్మితే బస్తా రూ.1,650 వరకు గిట్టుబాటు అయినట్లే అని రైతులు అంటున్నారు. ఉప్పుడు బియ్యం మిల్లులు కోసం వ్యాపారులు పచ్చి ధాన్యాన్ని ముమ్మరంగా కొనుగోళ్ల చేస్తున్నారు. సీజన్ మొదట్లో పచ్చి ధాన్యం బస్తా 75 కేజీలు బస్తా రూ.1,620కి కొలుగోలు చేసిన వ్యాపారులు సరుకు ఎక్కువ వస్తుండటంతో రేట్లు తగ్గించారని రైతులు వాపోతున్నారు. ఎకరానికి 30 నుంచి 40 బస్తాల వరకు దిగుబడులు వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి

కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని


కైకలూరు మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ కామినేని

కైకలూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధిలో రాజకీయాలకు అతీతంగా పనిచేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శనివారం కైకలూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అడవి వెంకట కృష్ణమోహన్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో రాజకీయ కోణాలు చూడవద్దని చేతైనంత ప్రజలకు సహాయం చేయాలని సూచించారు. ప్రజాహితమైన పనులను నిర్వహించే సమయంలో కొంతమందికి బాధ కల్గించినా మంచి పనులు చేసితీరాలని అందుకు ఎవరైనా అడ్డువచ్చినా సహించమన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రతీ గ్రామంలోనూ తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఆయా గ్రామాల్లో అవసరమైన పనులను అధికారులు గుర్తించి ప్రతిపాదనలు తయారు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. రూ.28 కోట్ల నిధులతో రహదారులు అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కురెళ్ల బేబి, ఎండీవో రెడ్డిబత్తుల ఫణీంద్ర, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుంతలు లేని రహదారులు నిర్మాణం.

వైసీపీ ప్రభుత్వంలో రహదారులు అభివృద్ధి చేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆటపాక నుంచి అగ్రహారం వెళ్లే రహదారిని మిషన్ పాట్ హోల్ ఫ్రీ పనులను ఆయన ప్రారంభించారు. కూటమి నేతలు వీరమల్లు నరసింహా రావు, పెన్మెత్స త్రినాథరాజు, తాడినాడ బాబు, పూల రామచంద్రరావు, పామర్తి రాంబాబు, కొల్లి వరప్రసాద్, సర్పంచ్ ఉప్పలపాటి నాగమణి, అధికారులు పాల్గొన్నారు. కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ముగ్గురుకు 9,93,742 చెక్కులను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అందజేశారు.

రహదారుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

కలిదిండి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అధ్వానంగా ఉన్న రహదారులను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. శనివారం కొచ్చెర్లలో రూ.27 లక్షలతో చేపట్టే కొచ్చెర్ల-వైవాక రహదారి మరమ్మతుల పనులకు శంకుస్థాపన చేశారు. కూటమి నాయకులు పోకల జోగిరాజు, వలవల రామారావు, చెన్నంశెట్టి మురళీకృష్ణ, కేశిరెడ్డి బలరామ్, బట్టు లీలా కనకదుర్గ, చలమలశెట్టి లక్ష్మీపార్వతి, కొచ్చెర్ల మహేష్, వీరమల్లు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కొండ శిఖరాగ్రానికి చేరిన ఘాట్ రోడ్డు పనులు

ఆగిరిపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి శోభనాచల స్వామి ఘాట్ రోడ్డు పనులు 30 రోజులకు ఆర్‌అండ్‌బీ ఇంజినీర్లు, సర్వేయర్ల పూర్తి పర్యవేక్షణలో కొండ శిఖర భాగానికి చేరింది. తొలుత ఘాట్ రోడ్డు కొండ వెనక వైపున మ్యాపింగ్ చేయగా అటు పూర్తిగా బండరాళ్లతో నిండి ఉండటం వల్ల కొండ ముందు నుంచి ఘాట్ రోడ్డు పనులు చేస్తున్నారు. ఈ పనులు పూర్తి అయితే మెట్ల మార్గంలో ఉన్న చిన్న ఆలయాలకు సైతం పూర్వవైభవం వస్తుందని గ్రామస్తులు సంతోష పడుతున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి


వ్యాపారస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

నూజివీడు టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాల ఏర్పాటుకు వర్తక, వాణిజ్య సంఘాలు ముందుకు రావాలని నూజివీడు పట్టణ సీఐ సత్య శ్రీనివాస్ కోరారు. నూజివీడు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో వ్యాపార, వర్తక, వాణిజ్య సంఘాలతో సమావేశం అయ్యారు. వ్యాపార సంస్థల వద్ద విధిగా సీసీ కెమేరాలు ఏర్పాటుచేయడం వల్ల నేరాలపై నిఘా ఉంచి అరికట్టే వీలు కలుగుతుందన్నారు. ప్రధాన కూడళ్లలో సీసీ కెమేరాల ఏర్పాటుకు సంఘ నాయకులు సహకరించాలని ఆయన కోరారు.

ఏలూరులో జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు

ముసునూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏలూరులో రెండు రోజులపాటు జరిగే యూటీఏఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కె.గాంగేయుడు కోరారు. ముసునూరులో శనివారం ఆయన మాట్లాడుతూ నూజివీడు, ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి మండలాల యూటీఎఫ్ కార్యాకర్తలు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కలిదిండి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన ఓ యువకుడు మృతి చెందిన ఘటన కోరుకొల్లులో జరిగింది. ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలివి. దెందులూరుకి చెందిన కాళిదాసు అంజిబాబు(25) కోరుకొల్లులో ఓ చికెన్ షాపులో పని చేస్తున్నాడు. పది రోజుల క్రితం పురుగు మందు తాగడంతో గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

కైకలూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బాలికను ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి మోసగించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేశామని కైకలూరు టౌన్ ఎస్ఐ డి.వెంకట్ కుమార్ తెలిపారు. కైకలూరు టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ మండలానికి చెందిన సుగుణరావు అనే వ్యక్తి మాయమాటలు చెప్పి బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పి వేరే ప్రదేశానికి తీసుకువెళ్లి అత్యాచారానికి ప్రయత్నించడంతో బాలిక కేకలు వేయగా అక్కడ నుంచి పారిపోయాడు. బాలిక ఇంటికి వెళ్లి తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లగా ఈ నెల ఒకటో తేదీన తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు ముద్దాయిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

టెన్నీకాయిట్ పోటీల్లో కానుకొల్లు విద్యార్థుల ప్రతిభ


టెన్నికాయిట్ పోటీల్లో విజేతలుగా నిలిచిన కానుకొల్లు విద్యార్థులు

మండవల్లి నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పెదపాలపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కైకలూరు నియోజకవర్గ స్థాయి ఆటలపోటీల్లో టెన్నీకాయిట్ పోటీల్లో కానుకొల్లు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. బాలుర సీనియర్స్ విభాగంలో జి.నాగసాయి, మోహనశశి, ఎన్.డేవిడ్, శశిదర్, బాలుర జూనియర్ విభాగంలో కె.వంశీకృష్ణ, నవదీప్, పి.అఖిల్, రాజ్‌కుమార్.. బాలికల సీనియర్స్ విభాగంలో రుక్మిణిదేవీ, సౌమ్యకీర్తి, కె.దుర్గాభవానీ, బాలికల జూనియర్స్ విభాగంలో ఎస్.కావ్య, ఎస్.తేల్విని, వి.వైష్ణవి జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. శనివారం విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్‌వీ మాధవకుమార్, పీడీ సత్యనారాయణ, అధ్యాపకులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీల్లో నెల్లూరు జట్టు ఫస్ట్


మొదటి బహుమతి గెలుచుకున్న నెల్లూరు టీంకు నగదును అందజేస్తున్న కిషోర్

కైకలూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీల్లో నెల్లూరు జిల్లాకు చెందిన టీం మొదటి బహుమతి సాధించింది. కైకలూరు మండలం వేమవరప్పాడులో గతనెల 26వ తేదీ నుంచి జరుగుతున్న రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీల్లో ఫైనల్స్ శనివారం జరిగాయి. ఈ పోటీల్లో నెల్లూరు టీం, వేమవరప్పాడుకు చెందిన టీంలు పోటీపడగా నెల్లూరు టీం విజయం సాధించింది. వేమవరప్పాడు టీం సెకండ్ ప్రైజ్ సాధించింది. మొదటి బహుమతి బోడిగడ్డ సమాధానం జ్ఞాపకార్థం వారి కుమారుడు కిషోర్ రూ.40 వేల నగదు అందజేశారు. రెండో బహుమతి గ్రామానికి చెందిన బోడావుల శ్రీను రూ.30 వేలు నగదు బహుమతిని అందజేశారు. ఈ చెడుగుడు పోటీల్లో ప్రతి భ చూపిన ఆటగాళ్ళకు ప్రత్యేక బహుమతులను అందజేశారు. నియోజకవర్గ టీడీపీ కో-కన్వీనర్ తేరా రమేష్‌బాబు, సర్పంచ్ నున్న రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పంట పెట్టుబడి సాయాన్ని అందించాలి


వినతపత్రాలను చూపుతున్న నాయకులు

ముసునూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పంట పెట్టుబడి సాయం (అన్నదాత సుఖీభవ) ఇంత వరకు ప్రకటించకపోవడం విచారకరమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు నిమ్మగడ్డ నరసింహా అన్నారు. బలివేలో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ సీజన్ వచ్చినప్పటికి ప్రభుత్వం ఇంతవరకు పంట పెట్టుబడి సాయం అందించకపోవడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వరికి మద్దతు ధర ప్రకటించకపోవడం అన్యాయమన్నారు. ఈ నెల 4న రైతు సంఘం ఆధ్వర్యంలో అన్ని సచివాలయాల్లో రైతులతో కలిసి వినత పత్రాలను అందజేయునున్నట్లు చెప్పారు. మండల రైతుసంఘం నాయకులు చెంగల వెంకటేశ్వరరావు, జంగిమిల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ సెలక్షన్‌కు విద్యార్థుల ఎంపిక


క్యాంపస్ సెలక్షన్స్‌లో ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్

నూజివీడు టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ విద్యార్థులు హైదరాబాద్‌కు చెందిన కాస్‌టెక్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ తెలిపారు. మొదటి ఆరు నెలలు ఇంటర్నెషిప్ ద్వారా వీరు శిక్షణ పొందుతారని అప్పుడు రూ.15 వేలు వేతనం అందుతుందన్నారు. గత కొన్నేళ్లుగా మెటలర్జీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి పలు సంస్థల్లో ఉద్యోగ అవకావాలు పొందుతున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వోడీ బి.వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ వీర శ్రీను, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

నూజివీడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రక్తదానంతో ప్రాణదాతలుగా మారి బాధిత కుటుంబాలకు విద్యార్థులు అండగా నిలవడం అభినందనీయమని నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్రకుమార్ అన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో హెల్పింగ్ హ్యాండ్స్, రోటరీ క్లబ్, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్రకుమార్ లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మొత్తం 71 యూనిట్ల రక్తాన్ని రెడ్‌క్రాస్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ ప్రతినిధులు, రెడ్‌క్రాస్ ప్రతినిదులు పాల్గొన్నారు.

దేశ నిర్మాణంలో విద్యార్థుల ప్రాతే కీలకం

నూజివీడు టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సామాజిక అభివృద్ధిలో దేశ నిర్మాణం కోసం విద్యార్థులు తమ వంతు పాత్ర పోషించాలని ఏసీపీ సీఐ కె.శ్రీనివాస్ అన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు విజిలెన్స్ అవేర్‌నెస్ వింగ్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తాము సమాజంలో పరిస్థితులను గుర్తిస్తూ అసాంఘిక కార్యకలాపాలు ప్రధానంగా అవినీతిని ఎదుర్కొనేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలన్నారు. అవినీతిపై ఏసీబీకి సమాచారం ఇస్తే వారి వివరాలను రహస్యంగా ఉంచి అవినీతి పరులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పార్థసారథి పర్యటన

చాట్రాయి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మంత్రి కొలుసు పార్థసారథి ఆదివారం చాట్రాయి మండలంలో పర్యటిస్తారని టీడీపీ కార్యాలయం నుంచి ఒక ప్రకటన వెలువడింది. ముందుగా 12 గంటలకు పోలవరంలో శ్రీఉమా కోటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసి, అనంతరం ప్రైవేట్ ఫంక్షన్‌లో పాల్గొంటారని, తరువాత చాట్రాయి, చనుబండలలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసి, సాయంత్రం 4.30కి చనుబండలో బహిరంగ సభకు హాజరవుతారని తెలిపారు.

ఒరిగిన వరి పైరు పరిశీలన

ముదినేపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఈదురు గాలులతోపాటు కురిసిన వర్షాలకు ముదినేపల్లి మండలంలో నేలకొరిగిన సార్వా వరి పైరును వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది శనివారం పరిశీలించారు. ఏవో వేణుమాధవ్ ఆధ్వర్యంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ముదినేపల్లి, వడాలి, కాకరవాడ తదితర గ్రామాల్లో పొలాల్లో పడిపోయిన వరి పైరును పరిశీలించి పంట రక్షణకు పలు సూచనలు చేశారు. పడిన వరి పైరును లేపి కట్టలు కట్టి గింజ తయారైతే రంగు మారకుండా, మొలకెత్తకుండా పైరుపై ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని ఏవో రైతులకు తెలిపారు. పొలాల నుంచి ముందుగా నీటిని బయటికి పంపించే ఏర్పాటు చేయాలని సూచించారు.

మత్స్య సహకార సొసైటీ ఎన్నిక వాయిదా


ఎన్నికలను పర్యవేక్షిస్తున్న పోలీసులు

మండవల్లి నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తక్కెళ్ళపాడు మత్స్య సహకార సొసైటీ ఎన్నికలు నిర్ణీత సమయంలో ఎవరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో వాయిదా వేసినట్టు ఎన్నికల అధికారి సతీష్ తెలిపారు. సభ్యులంతా రెండు పార్టీలుగా విడిపోవడంతో అధ్యక్ష పదవి కోసం పోటీపడ్డారు. 101 మంది సభ్యులు ఉండగా అధ్యక్ష పదవికి నామినేషన్ వేసేందుకు ముందుకు శనివారం నామినేషన్ గట్టం పూర్తి చేసి ఎన్నికల నిర్వహణకు అంతా రంగం సిద్ధం చేశారు. 48 మంది సభ్యులు మాత్రమే సమీపంలో అందుబాటులో ఉండడంతో మిగిలిన వారు అందుబాటులో రాకపోవడంతో నామినేషన్ వేయకపోవడంతో వాయిదా పడింది. ఎన్నికల నిర్వహణ తేదీని త్వరలో ప్రకటిస్తామని ఆర్వో తెలిపారు.

పట్టభద్రుల ఓటర్ల నమోదు కేంద్రం ప్రారంభం

కలిదిండి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కలిదిండిలో డెమోక్రటిక్ పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటర్ల నమోదు కేంద్రం శనివారం ప్రారంభించారు. పీఆర్‌టీయూ నాయకులు మాట్లాడుతూ పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు డీవీ నాగేశ్వరరావు, మేకా రామారావు, బాలాజీ, బి.వీరబాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

విశాఖపట్నం వెళ్లి పింఛన్ అందజేత

నూజివీడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో వైద్య చికిత్స నిమిత్తం విశాఖపట్నం వెళ్ళిన వృద్ధురాలికి నూజివీడు మండలం రామన్నగూడెం పంచాయతీ కార్యదర్శి నాగరాజు శనివారం విశాఖపట్నం వెళ్ళి వృద్ధాప్య పింఛన్ అందించారు. గ్రామానికి చెందిన దేవమణి ఆరోగ్య కారణాలతో గత కొన్ని రోజులుగా విశాఖపట్నంలో ఉంటోంది. విషయం తెలుసుకున్న నాగరాజు విశాఖపట్నం వెళ్లి దేవమణికి పింఛన్‌ను అందించారు. విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించిన నాగరాజుకు గ్రామస్తులు, ఆమె కుటుంబ సభ్యులు అభినందించారు.

ఎయిమ్స్ ఆసుపత్రికి వెళ్లి..

ఆగిరిపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నెక్కలం గొల్లగూడెంకి చెందిన పింఛన్ దారి గోగం రాధ అనారోగ్యం కారణం వల్ల మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రిలో చేరగా పింఛన్ పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రికి వెళ్ళి లబ్ధిదారునికి పింఛన్ అందచేశారు.

ఘనంగా తపనా చౌదరి జన్మదిన వేడుకలు

మండవల్లి నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామంలోని షిర్డి సాయిబాబా మందిరంలో రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి గారపాటి తపనా చౌదరి జన్మదిన వేడుకలు స్థానిక బీజేపీ నాయకులు జి.చిట్టిబాబు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కె.వెంకటరాంప్రసాద్, జి.వరప్రసాద్, బి.దివాకర్, బి.శ్యామలరావు, తదితరులు పాల్గొన్నారు.